# గీతోపనిషత్


(శ్రీమద్భగవద్గీత 7వ అధ్యాయము - విజ్ఞాన యోగము)


మాస్టర్ పార్వతీకుమార్

ధనిష్ఠ

## ధనిష్ఠ ప్రచురణలు














ప్రతులకు : ధనిష్ఠ ఫౌండేషన్, 15-7-1, ఏంజిల్స్ ఎన్‌క్లేవ్, కృష్ణనగర్,
విశాఖపట్నం - 530 002. ఫోన్ : 0891-2701531
www.dhanishta.org info@dhanishta.org

# గీతోపనిషత్

(శ్రీమద్భగవద్గీత 7వ అధ్యాయము - విజ్ఞాన యోగము)

**మాస్టర్ పార్వతీకుమార్**

**ధనిష్ఠ**

ప్రథమ ముద్రణ : 2016 శ్రీరామ నవమి

ప్రతులు : 1,000

వెల : రూ॥ **50-00**

ప్రతులకు :

**ధనిష్ఠ పబ్లికేషన్స్,**

15-7-1, ఏంజిల్స్ ఎన్‌క్లేవ్,

కృష్ణనగర్, విశాఖపట్నం - 530 002.

ఫోన్ : 0891-2701531, 2509154.

e-mail : www.dhanistha.org.
info@dhanistha.org.

ISBN : 978-81-89467-62-3

ముద్రణ :

**సత్యం ఆఫ్‌సెట్ ఇంప్రింట్స్**

మధురానగర్,

విశాఖపట్నం - 530 016.

ఫోన్ : 0891-2796538, 9849996538.

# ధనిష్ఠ

## స్వచ్ఛంద సేవా సంస్థ

**"ధనిష్ఠ"** అనగా ధనపూరిత దివ్యవాయువు. ధనమనగ దివ్య సంపద. అది కేవలము డబ్బుకాదు. డబ్బుతో సంపదను కొలువ లేము, కొనలేము. సంపద జీవన వైభవమునకు సంబంధించినది. మన శ్రుతులలో అగ్ని, వాయువు, ఇంద్రుడు, బృహస్పతి యిత్యాది దివ్య ప్రజ్ఞలను ధనమనిరి. ఆర్ష విజ్ఞానమే నిజమైన ధనము. అట్టి ధనమును కూర్పుచేసి వ్యాప్తి చేయుటకు "ధనిష్ఠ" 1992లో జన్మించినది.

**"ధనిష్ఠ"** మాస్టర్ పార్వతీకుమార్‌గారి వాక్కును సి.డి., ఆడియో, వీడియో క్యాసెట్ల రూపములోను, పుస్తకముల రూపము లోను భద్రపరచి సత్సాధకుల కందించునట్టి యజ్ఞార్థకర్మను చేపట్టినది.

**"ధనిష్ఠ"** ఒక చక్కని గ్రంథాలయమును, ధ్యాన మందిరమును సద్గోష్ఠికై వలసిన వాతావరణమును – "జగద్గురు మందిరము"గ ఏర్పరచి, ఆసక్తి కలవారికి ధ్యానము, స్వాధ్యాయము నేర్పుచున్నది.

## సంకలనకర్త : మాస్టర్ పార్వతీకుమార్

**మా**తృదేశము మొదలుగా ఉత్తర అమెరికా, లాటిన్ అమెరికా మరియు ఐరోపా ఖండములలోగల ఆధ్యాత్మిక జిజ్ఞాసువులకు ప్రచోదనము కలిగించుచూ, భక్తి, జ్ఞానము, వైరాగ్యము, యోగాభ్యాసము యిత్యాది విషయములలో బోధనలు గావించుచూ, పరమగురువుల మార్గానుయాయు లకు వెలుగుదారి చూపించు చున్న సత్సాధనా సంపత్తిగల నవయుగ యోగ మార్గదర్శి **మాస్టర్ పార్వతీకుమార్**గారు. వారి బోధనలు లెక్కకుమించి యున్ననూ, పలురకములైన విషయ, విజ్ఞాన బోధనలుగా తెలియవచ్చును. అవి బోధనలుగానే కాకుండా నిత్యజీవితమున అనుసరణీయమై, ఆచరణ యోగ్యమై, ఆచరించువారికి సత్యదర్శనమున సత్వర ఫలితముల నందించు చున్నవని తెలుపుట అతిశయోక్తి కానేరదు.

సాంఘిక, ఆర్థిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, కళారంగములలో వారి నిరంతర సేవలను గుర్తించి, గౌరవించి, ఆంధ్ర విశ్వకళా పరిషత్ 1997వ సంవత్సరములో **"డాక్టర్ ఆఫ్ లెటర్స్"** పట్టా నందించినది. 2013వ సంవత్సరములో గౌరవ ఆచార్యులుగా నియమింపబడిరి.

ఆర్థిక, సాంఘిక, సేవారంగములలో – మానవాళి మనుగడలో సుఖము, శాంతి పరిమళింపజేయు సూత్రముగా ఆధ్యాత్మికత అలరారినప్పుడే దానికి

సాఫల్యత, సార్థకత ఉండునని, *"మానవ సేవయే మాధవ సేవ"* అను మాటకు సరియైన అర్థము యిదేనని మాస్టరుగారు తమ ప్రవర్తన ద్వారా తెలియ పరచుచున్నారు. మాస్టర్ పార్వతీకుమార్‌గారు బాధ్యతగల గృహస్థులు, పేరున్న ఆర్థిక సలహాదారు, విజ్ఞానమును వికసింపజేయు గురువు, శారీరక – మానసిక రుగ్మతలను తొలగింపజేయు వైద్యులు, శతాధిక గ్రంథముల సంకలన కర్త, నిగర్వి, నిర్మల హృదయులు.

జ్ఞానము ఏ ఒక్కరికి చెందినది కాదనియు, జ్ఞానులు సైతము అందరునూ జ్ఞానమునకే చెందిన వారనియూ, జ్ఞానమే సరియగు వాహికల నెన్నుకొని తనను తాను ప్రకటించుకొనుచుండు ననియూ, అందుచే నిజముగా ఎవ్వరూ గ్రంథకర్తలు కాజాల రనియూ, సంకలన కర్తలే ననియు మాస్టరుగారి దృఢ విశ్వాసము. విశేష పరిజ్ఞానముగల ప్రతిభావంతు లైనప్పటికి సౌశీల్యముతో సామాన్యుల మిత్రత్వము నభిలషించు సమవర్తి.

మాస్టర్ పార్వతీకుమార్‌గారి ఆధ్వర్యమున ఎన్నియో ధార్మిక సంస్థలు దేశ విదేశములలో పరహితసేవ గావించుచున్నవి. "పరహితము పరమధర్మ" మను ఆర్యోక్తి వారి జీవితమును నడిపించుచున్నది. భగవద్ధ్యానము, స్వాధ్యాయము, పరహితములకు త్రిధాబద్ధులుగా ఎందరో ఆస్తికులకు వారు ప్రపంచమున ప్రచోదనము గావించుచున్నారు. పరమగురు పరంపర వారి కాదర్శము.

**- ధనిష్ఠా ఫౌండేషన్**

# ముందు మాట

శ్రీమద్భగవద్గీత యందు సప్తమాధ్యాయముగ "విజ్ఞాన యోగము" వెలుగు నిచ్చుచున్నది. జగద్గురుపీఠము నిర్వర్తించు ఆధ్యాత్మిక దర్శన మాసపత్రిక యగు 'నావాణి' యందు 'గీతోపనిషత్' అను శీర్షికగ సాంఖ్య, కర్మ, జ్ఞాన, కర్మసన్యాస, ఆత్మ సంయమ యోగములుగ ప్రసిద్ధికెక్కిన అధ్యాయములను వివరించుట జరిగినది. సత్సాధకుడు ఆత్మ సంయమము నొందుటకు వలసిన సోపానము లన్నియు శ్రద్ధాభక్తులతో అందించుట జరిగినది. ఈ ఐదు అధ్యాయ ముల వివరణము 'సాధనా పంచకముగ' సత్సాధకుల కందించ బడినది. నిజమునకు ఆత్మ సంయమము చెందిన సాధకుడు సమస్త జ్ఞానమును పొందుటకు వలసిన అర్హతను పొందును. సూక్ష్మబుద్ధి గలవారు ఆ తరువాతి అధ్యాయములను నిజమునకు స్వానుభవమున నేర్వగలరు. తాటిచెట్టెక్కు వారికి కొంతవరకు చేయూత నిచ్చినచో అటుపైన అతడే వృక్షాగ్రమును చేరునుగదా! అట్టి భావనతో తరువాతి అధ్యాయములకు వివరణము అందించుట నిలిపివేయుట జరిగినది.

కాని అంతర్యామి దైవము శ్రద్ధాళులైన పాఠకుల రూపమున అడప దడప ఇతర అధ్యాయములు కూడ వివరించమని సూచించిరి. ఆ ఉపేక్షను గమనించి ఆదేశించుట ఆరంభించెను. తత్ఫలితమే ఈ విజ్ఞాన యోగ వివరణము.

'ఓం ఇత్యే తత్' అనునది ఉపనిషత్ వాక్యము. 'ఇది అంతయు అదియే' అని వ్యాక్యార్థము. కనపడుతున్న ఈ సృష్టి అంతయు కూడ దైవమే. అట్లు చూడనేర్చుట సాధన. అష్ట ప్రకృతులతో నిర్మింపబడిన ఈ సృష్టికి మూలప్రకృతి ఆధారము. అదియే దివ్య ప్రకృతి. దైవము యొక్క వెలుగు మొదటి తొడుగు. దైవము తన ప్రకృతి నుండి అష్ట ప్రకృతుల ద్వారా ఈ సృష్టియంతయు వ్యాప్తిచెంది తానే యున్నాడు. కనపడుతున్నదల్లకూడ సూక్ష్మదృష్టితో చూచినచో పదిగ గోచరించును. అవి పంచభూతములు, మూడు గుణములు, దాని నధిష్ఠించియున్న మూలప్రకృతి అను వెలుగు, దాని కాధారమైన తత్త్వము. ఇట్లు పదవది యగు తత్త్వము, తొమ్మిదవది అగు వెలుగు ద్వారమున అష్ట ప్రకృతుల యందు ప్రకాశించు చున్నాడు. ఇట్లు ప్రకాశించు తత్త్వమును దర్శించుట ఈ అధ్యాయమునందు తెలుపబడిన సాధన. ఇట్లు దృశ్యమాన జగత్తున ప్రకాశించునది, వర్తించునది, నర్తించునది దైవమే అని తెలియుట వలన జీవుడు తన లోపల, తన బయట మరియు తానుగ దైవమే ఉన్నాడని తెలిసి అమితానందభరితు డగును. అట్టి వానికి సృష్టి విజ్ఞానము ప్రసన్నమగును. దైవానుభూతి అనుస్యూతముగ సాగుచుండగ, అవసరమును బట్టి సకల విద్యలు ప్రసన్నమగును. ఈ సత్యమును బ్రహ్మమగు శ్రీకృష్ణుడు విపులముగ పలికినదియే విజ్ఞాన యోగము.

సత్సాధకులకిది సమర్పితము.

7-4-2016 **- పార్వతీకుమార్**

# విషయసూచిక


| | | | |
|---|---|---|---|
| 1 | ఆసక్తి | ....... | 11 |
| 2 | విశిష్ట జ్ఞానము | ....... | 14 |
| 3 | నేను | ....... | 16 |
| 4 | తరింపు | ....... | 17 |
| 5 | అంతర్యామి | ....... | 19 |
| 6 | పరాప్రకృతి | ....... | 21 |
| 7 | సూత్రము | ....... | 23 |
| 8 | ఈశ్వర దర్శనము | ....... | 25 |
| 9 | పుణ్య గంధములు | ....... | 29 |
| 10 | విచక్షణ - వివేచన | ....... | 32 |
| 11 | ధర్మకాముడు | ....... | 35 |
| 12 | త్రిగుణములు | ....... | 38 |
| 13 | జ్ఞానము | ....... | 41 |
| 14 | నర-నారీ తత్త్వము | ....... | 43 |
| 15 | అసుర భావములు | ....... | 46 |
| 16 | నాలుగు శ్రేణులు | ....... | 49 |

| | | | |
|---|---|---|---|
| 17 | నిత్యయుక్తుడు | ....... | 52 |
| 18 | ఉన్నత పదము | ....... | 57 |
| 19 | దుర్లభుడు | ....... | 59 |
| 20 | హృతజ్ఞానులు | ....... | 63 |
| 21 | సమభావము | ....... | 67 |
| 22 | సృష్టి ధర్మము | ....... | 70 |
| 23 | అనంత తత్త్వము | ....... | 73 |
| 24 | "ఓం సత్యం పరం ధీమహి" | ....... | 76 |
| 25 | సత్య దర్శనము | ....... | 79 |
| 26 | అవ్యక్తుడు | ....... | 82 |
| 27 | దీన స్థితి | ....... | 84 |
| 28 | శాశ్వత పరిష్కారము | ....... | 87 |
| 29 | సారూప్యము | ....... | 91 |
| 30 | యుక్త చేతస్సులు | ....... | 94 |

# 1

# ఆసక్తి

**మయ్యాసక్తమనాః పార్థ యోగం యుంజ న్మదాశ్రయః ।**
**అసంశయం సమగ్రం మాం యథా జ్ఞాస్యసి తచ్ఛృణు ॥**

*తాత్పర్యము :* అర్జునా! నా యందు ఆసక్తి కల మనసు కలవాడు, స్మరణ మార్గమున నాతో కూడి యుండువాడు, నన్ను సదా ఆశ్రయించి యుండువాడు నిస్సందేహముగ సమగ్రమగు జ్ఞానము ఎట్లు పొందునో తెలిపెదను వినుము.

*వివరణము :* భగవానుడు సమగ్ర జ్ఞానము పొందుటకు జీవున కుండవలసిన స్థితిని ముందుగ పలికినాడు.

ప్రప్రథమముగ తనయందు (అంతర్యామి దైవమునందు) ఆసక్తి గల మనసుండ వలెను. దైవమునందాసక్తి లేనివానికి దివ్యజ్ఞానము కలుగదు. ఆసక్తి ప్రథమమగు అర్హత. ధన సముపార్జ నకు ధనాసక్తి ఎట్లో దివ్య జ్ఞానమునకు దైవాసక్తి అట్లుండవలెను. మెండుగ ఆసక్తి యున్నపుడే తదనుగుణమగు శ్రద్ధ యుండును. ప్రేమికునకు ప్రేమిక యందు గల ఆసక్తివలె గాఢముగ నుండ

వలెను. దివ్యవిషయముల యందాసక్తి ఒక బలముగ ఏర్పడి నిశ్చలమై యున్నపుడు అనుదినము దివ్య జ్ఞానమును మరికొంత ఎరుగుట జరుగును. జ్ఞాన మనంతము గనుక జ్ఞానము నందాసక్తి గల జీవుడు అనంతత్వము లోనికి గొనిపోబడును. అనంత జ్ఞానమున నిమగ్నుడై జ్ఞానమై మిగులును. జ్ఞానమే జ్ఞానిగ మిగులును. ఇనుము అయస్కాంతమై మిగిలినట్లు దైవ జిజ్ఞాస కారణముగ జ్ఞాని, జ్ఞానము అభేద స్థితి మిగులును. కనుక, నేను అను అంతర్యామి దైవమునందు ఆసక్తి మెండై యుండవలెను.

ఇక రెండవ విషయము దైవముతో యోగము చెంది యుండుట. తనయందు, అఖిల భూతముల యందు గల ఈశ్వరునితో నిత్య మనుసంధానము చెందుట నేర్వవలెను. నిత్య జీవితమున తారసపడు కుటుంబ సభ్యులు, మిత్రులు, బంధువులు, ఇతరులు అగు వారందరి యందు ఈశ్వరుడున్నాడని జ్ఞప్తిగొనుటయే యోగాభ్యాసము. కేవలము ఉభయ సంధ్యల యందు దైవముతో కూడు ప్రయత్నమును మాత్రమే యోగాభ్యాస మని తెలుపరాదు. ఈశ్వరుడు సర్వకాల సర్వావస్థల యందును, సర్వదేశముల యందును యున్నాడని తెలిసి, అన్నిట అంతట అతనితో కూడి యుండుటకు ప్రయత్నము జరుపవలెను.

మూడవ అంశము ఈశ్వరు నాశ్రయించుట. “నన్నాశ్రయించి నాతో కూడి యుండుము” అని దైవము ఆదేశించు

చున్నాడు. అన్ని వస్తువుల యందు, రూపముల యందు, జీవుల యందు గల ఈశ్వరుని ఆశ్రయించుట చక్కని సాధన. జీవుల స్వభావముల నాశ్రయింపక, అందలి దైవము నాశ్రయించుట నేర్వవలెను. అధికారులను, ధనవంతులను, కీర్తివంతులను ఆశ్ర యించుటగా కాక అందలి ఈశ్వరునే ఆశ్రయించవలెను. ఈశ్వర శరణాగతి అనునిత్యము సాగుచు నుండవలెను. శరణాగతి మార్గమున యోగము సిద్ధించును.

దైవమునందు ఆసక్తిగల మనసు, అన్నిటి యందలి దైవము నాశ్రయించు మనసు- దైవముతో యోగము చెందు మనసుగ నేర్పడును. అట్టి వానికి నిస్సందేహముగ సమగ్ర జ్ఞానము కలుగునని భగవానుడు బోధించు చున్నాడు.

# ②

# విశిష్ట జ్ఞానము

**జ్ఞానం తేఽహం సవిజ్ఞాన మిదం వక్ష్యా మ్యశేషతః ।**
**యజ్ఞాత్వా నేహ భూయోఽన్య జ్ఞాతవ్య మవశిష్యతే ॥**

*తాత్పర్యము :* నేను నీకు జ్ఞానమును విజ్ఞాన సహితముగ, నిశ్శేషముగ చెప్పెదను. దీనిని తెలిసిన పిమ్మట జగత్తులో తెలుసు కొనవలసినది ఏమియును మిగలదు.

*వివరణము :* విజ్ఞాన సహితమగు జ్ఞానమనగా, అను నిత్యము ఆచరణయందు గోచరించునది మరియు తోడ్పడునది కూడ. జ్ఞానము కలిగి విజ్ఞానము లేకున్నచో, అట్టి జ్ఞానము అక్కరకు రాదు. అక్కరకురాని జ్ఞానము అక్కరకురాని అస్త్రము వంటిదే. సమయమునకు ఉపయోగపడని తెలివి యున్నను లేకున్ననూ ఒక్కటియే. నిత్య జీవితమున వినియోగపడు జ్ఞానమే జ్ఞానము కాని, వినియోగపడని జ్ఞానము వలన ఏమి ప్రయోజనము? దైవము అన్నిట అంతట వ్యాప్తిచెంది యున్నాడని తెలిసియున్నను, ఒక వ్యక్తితో వర్తించునపుడు గాని, ఒక సన్నివేశమునగాని, ఒక దృశ్య మునగాని, ఒక పనియందున్నప్పుడు గాని దైవము యొక్క సర్వ

వ్యాపకత్వము జ్ఞప్తికి రాదు. కనుక అజ్ఞానముతో ప్రవర్తించుటయే యుండును.

కనుక జ్ఞానము, అనగా తెలియుటవలన ఉపయోగము లేదు. అది ఆచరణయందు కూడ అందుబాటులో యుండవలెను. 'నేను' అను అంతర్యామి దైవము నుండియే సమస్త ముద్భవించి, వృద్ధి చెంది, లయము చెందుచుండగ, అన్నిటియందు దైవము యొక్క అస్తిత్వము గుర్తించి వర్తించినచో, వర్తనమున సమభావ ముండును. దర్శన ముండును. ఆనంద ముండును. కనుక జ్ఞానము నటకెక్కించక నిత్య జీవనములోనికి దింపుకొనుటయే మార్గము. అట్లు దిగి యున్నపుడు జ్ఞానము విజ్ఞానముగ భాసించును. విశిష్ట జ్ఞానమై యుండును. అట్టి విశిష్ట జ్ఞానమున్నవాడే బ్రాహ్మణుని యందును, గోవునందును, ఏనుగు యందును, కుక్క యందును, కుక్క మాంసము తిను వాని యందును- అనగా అన్నిటి యందును దైవమును దర్శించుచు సమవర్తనముతో నుండును. ఇట్టి విజ్ఞానము కొరవడిన నాడు సమవర్తనము లేక సృష్టియందు తనను తాను బంధించుకొనును. విజ్ఞాన యోగ మనగా ఇట్టి విశిష్ట జ్ఞానముతో అనుక్షణము కూడి యుండుట. అది యెట్లో భగవానుడు తరువాతి శ్లోకములలో తెలియ చెప్పు చున్నాడు.

## 3

# నేను

**మనుష్యాణాం సహస్రేషు కశ్చి ద్యతతి సిద్ధయే ।**
**యతతామపి సిద్ధానాం కశ్చి న్మాం వేత్తి తత్త్వతః ॥**

*తాత్పర్యము :* వేలాదిమంది మానవులలో ఏ ఒక్కడో విజ్ఞానసిద్ధికై యత్నించును. యత్నించి, జ్ఞానసిద్ధి పొందినవారు వేలాదిమంది యుండగ, అందు ఏ ఒక్కడో జ్ఞానము ద్వారా నన్ను దర్శించును.

*వివరణము :* శాస్త్రములు కోకొల్లలుగ కలవు. శ్రద్ధతో అధ్యయనము చేయువారికి శాస్త్రజ్ఞానము లభించుట పరిపాటి. ఆ జ్ఞానము ఆచరణ ద్వారా ఆకళింపు చేసుకొనుట కూడ మహా పండితులయందు దర్శింపవచ్చును. కాని ఆ శాస్త్రములకు మూలము, సారము అయిన నన్ను తెలియుట వారికి వీలుపడదు. జ్ఞానమే తానై, తన్ను జ్ఞానములో లయము చేసుకొన్నవారికే 'నేను' తెలియుట జరుగును. 'నేను' తెలియని శాస్త్రజ్ఞానము జీవునకు ఉద్ధారణము నీయవు. జ్ఞాన మనగా నేనే. జ్ఞాన సముపార్జనము చేయువాడు ఆ జ్ఞానముల ఇమిడి, ఇగిరిపోయినపుడే నన్ను దర్శించుట సాధ్యపడును. లక్షలాదిమందిలో ఒకనికది సాధ్యపడ వచ్చును.

④

## తరింపు

**భూమి రాపో౽నలో వాయుః ఖం మనో బుద్ధి రేవ చ ।**
**అహంకార ఇతీయం మే భిన్నా ప్రకృతి రష్టధా ॥**

*తాత్పర్యము :* నా ప్రకృతి నుండి ఎనిమిది భిన్న ప్రకృతులు పుట్టుచున్నవి. అవి వరుసగా అహంకారము, బుద్ధి, మనస్సు, ఆకాశము, వాయువు, అగ్ని, జలము, పృథివి.

*వివరణము :* నా ప్రకృతి యనగా దైవము యొక్క ప్రకృతి. అనగా దైవీ ప్రకృతి. అనగా దైవ స్వభావము. దైవమునకు దైవ స్వభావము, అట్లే ప్రతి జీవికిని తన స్వభావ ముండును. ఈ దైవ స్వభావమునందు అష్ట ప్రకృతులున్నవి. జీవులయందు కూడ అష్ట ప్రకృతులున్నవి. దైవము తన స్వభావము నధిష్ఠించి యుండును. జీవుడు తన స్వభావమునకు తాను లోబడి యుండును. దైవము తన అష్ట ప్రకృతుల ద్వారా తన శరీరము నిర్మాణము చేసుకొనును. సృష్టియే అతని దేహము. సృష్టి యంతయు అష్ట ప్రకృతులచే నిర్మాణము చేయబడును. జీవుల శరీరము కూడ అష్ట ప్రకృతులచే నిర్మాణము చేయబడినది. ప్రతి జీవికిని తనదైన అహంకారము, బుద్ధి, మనస్సు, పంచభూతములతో నిర్మాణము చేయబడిన

శరీరము యున్నవి. జీవుడు తన స్వభావమునకు లోబడుటకు కారణము బుద్ధి లోపించుటయే. తన యందలి పంచభూత ములు, మనస్సు, తాను, తనయందు సమన్వయము చెందు నపుడు బుద్ధియను ప్రకృతి వికసించును. బుద్ధి వికాసము కలుగు చున్నకొలది మంచి చెడ్డలను, నిత్యానిత్యములను తెలిసికొనుట, అందు మంచిని, నిత్యత్వమును స్వీకరించుట జరుగును. బుద్ధి లోపించిన ఎడల తనయందలి ప్రకృతి వ్యవస్థ అస్తవ్యస్తమై అస్వస్థత, అజ్ఞానము ఏర్పడును. పాలనుండి వెన్న తీసినట్లుగ తనయందలి ప్రకృతులను మథనము గావించుకొని, బుద్ధిని పెంపొందించుకు రావలెను. ఇదియే యోగమున ప్రధానమగు సోపానము. బుద్ధివలన జ్ఞానము, దైవముతో యోగము సంభవించి జీవుడు తన ప్రకృతినుండి తరించును.

## 5

# అంతర్యామి

**అపరేయ మిత స్త్వన్యాం ప్రకృతిం విద్ధి మే పరామ్ ।**
**జీవభూతాం మహాబాహో య యేదం ధార్యతే జగత్ ॥**

*తాత్పర్యము :* ముందు తెలిపిన ఎనిమిది ప్రకృతుల కన్నను భిన్నమై, వానికి ఫలమై నా పరాప్రకృతి యుండును. అది ఉత్తమ ప్రకృతి. అదియే మూల ప్రకృతి కూడ. ఈ మూలప్రకృతి కన్న ముందు నుండి యున్నవాడను నేను. నా ఈ ఉత్తమ ప్రకృతి నుండియే ఎనిమిది చిల్లర ప్రకృతులు పుట్టుచున్నవి. వీటన్నిటికి అతీతమైన నేను, నా మూలప్రకృతి ద్వారా ఎనిమిది ప్రకృతులను ధరించి యున్నాను.

*వివరణము :* ముందు శ్లోకమున చెప్పిన ఎనిమిది ప్రకృతులును వానికి మూలమైన ప్రకృతి నుండి ఏర్పడుచున్నవి. కనుక మూలమగు తొమ్మిదవ ప్రకృతి మూలప్రకృతిగ తెలుపబడుచున్నది. ఇదియే శుద్ధ చైతన్యము. "నేను" అను అంతర్యామి దైవము తొమ్మిదవ ప్రకృతికి కూడ పరమై యున్నాడు. ఈ తొమ్మిది ప్రకృతుల యందు కూడ యున్నాడు. ఇన్నిటిని తానే ధరించి

యున్నాడు. వీటియందు అంతస్సూత్రముగ నుండుటచే అంతర్యామి అని పిలువబడు చున్నాడు. ఈ నవ విధ ప్రకృతులకు కూడ ఫలమై యుండుటచే బహిర్యామి అని పిలువబడుచున్నాడు. బహిరంతరములందు వ్యాప్తి చెందియున్న తత్త్వము నేనే అని కృష్ణుడు పలుకుచున్నాడు. ఇట్లు ఈ తొమ్మిది యందును, వాటికి వెలుపలను పదియవ వాడుగ తానున్నానని తెలుపుచున్నాడు.

సర్వవ్యాపకమైన నేను తొమ్మిది ప్రకృతుల నేర్పరచుకొని వానియందు ప్రవేశించి, వసించి అంతర్యామిగ తన మహిమను చూపుచున్నాడు. నవవిధ ప్రకృతుల యందు ఉనికిగ నున్న ఈ నేనను తత్త్వమును నిత్యము గమనించువారికి ఈ విధమగు ప్రకృతులన్నియు వాని లక్షణములను విశదపరచును. ఋషులు తపస్సుచే అన్నిట, అంతట అంతర్హితముగ నున్న ఈ అంతర్యామిని దర్శించి వానితో అనుసంధానము చెందుటవలన వారికి సృష్టి విజ్ఞానము విశదపడినది.

⑥

# పరాప్రకృతి

ఏత ద్యోనీని భూతాని సర్వాణీ త్యుపధారయ ।
అహం కృత్స్నస్య జగతః ప్రభవః ప్రలయ స్తథా ॥

తాత్పర్యము : నా యొక్క పర, అపర ప్రకృతుల నుండియే సర్వ భూతరాసులును పుట్టినవని తెలుసుకొనుము. ఈ జగత్తు పుట్టుటకు, మరల లయము చెందుటకు కారణము నేనేయని ఎరుగుము.

వివరణము : సమస్త జగత్తునకు మూలకారణమైన ఈశ్వరుడు తన ప్రకృతి నుండి తానే రూపము కల్పించుకొని శ్రీకృష్ణునిగ భూమిపై చరించినాడు. కనుకనే ఈ జగత్తు పుట్టుకకు, పెరుగుదలకు, లయమునకు మూలము తానేయని ప్రకటించి నాడు. కోటానుకోట్ల జీవరాసులు పై తెలిపిన పరాప్రకృతి నుండి ఏర్పడిన మూడు ప్రకృతుల నుండి జన్మించినవా రనియు, అట్లు జన్మించిన ప్రకృతులకు, జీవులకు తానే ఈశ్వరుడనని అర్జునునకు భగవానుడు తన్నుతాను ప్రకటించుకొనెను.

తానాధారముగనే పరాప్రకృతి ఉద్భవించినది. ఆమె ఆధారముగనే సత్త్వరజస్తమో గుణములు గల ప్రకృతి ఏర్పడును.

ఆ ప్రకృతుల నుండియే పంచభూతము లేర్పడెను. త్రిగుణాత్మక ప్రకృతి, పంచభూతముల ప్రకృతి, అపర ప్రకృతులు. వాని నధిష్ఠించి అపర ప్రకృతియైన మూల ప్రకృతి యున్నది. మూల ప్రకృతికి మూలముగ తానున్నాడు. నవవిధ ప్రకృతులకు మూలమైన ఈశ్వరుడే పదియవ వానిగ నున్నాడు. అతడు తొమ్మిది ప్రకృతులకు ఆధారమై యుండుటయే గాక వాటన్నిటి యందును ప్రవేశించి యున్నాడు. తన ఆవరణలన్నింటిని ఆవరించి, ప్రవేశించి యుండుటవలన ఆ ఈశ్వరుని వాసుదేవుడని పేర్కొందురు. అన్నిటి యందు వసించి యున్నప్పటికిని అధిష్ఠించి గూడ యుండును. కనుక జగదీశ్వరుడు. అతడు జగత్తునకు లోపల వెలుపల కూడ యున్నాడు. చోటులో ఇల్లు కట్టినపుడు ఇంటి లోపల కూడ చోటుండును. ఒకటే చోటు లోపలగను, బయటగను ఏర్పడుట ఇల్లు కట్టుట వలన జరిగినది. ఇది నిజమునకు చోటునకు వెలుపల లోపల యని ఉండదు. కాని ఉన్నట్లు గోచరించును.

అట్టి ఈశ్వరుని నుండి నవ విధమగు ప్రకృతి ఆవరణలు ఏర్పడగా అందు పరాప్రకృతి నుండి తననుతానే సృష్టించుకొనునపుడు అవతారమూర్తియై విలసిల్లును. మిగిలిన అష్ట ప్రకృతుల నుండి జీవుడేర్పడగ, వారియందు కూడ తానే హృదయస్థుడై యుండును. పర, అపరా ప్రకృతులకుగాని, భూతకోటికిగాని అతడే ప్రభువు. అతడే ధరించువాడు. అతని సంకల్పము నుండియే జగత్తు పుట్టి, వృద్ధి చెంది అతనియందు లయ మగును. అట్టి ఈశ్వరుడు నేనే అని కృష్ణుడు అర్జునునకు తెలిపినాడు. అట్లు తెలిపినను తెలియుట సులభము కాదు. స్వానుభవమున తెలియవలసినదే.

7

## సూత్రము

**మత్తః పరతరం నాన్య త్కించి దస్తి ధనంజయ ।**
**మయి సర్వమిదం ప్రోతం సూత్రే మణిగణా ఇవ ॥**

*తాత్పర్యము :* నా కంటె వేరైనది, నేను కానిది అగు వస్తువు ఏదియును లేదు. అన్నిటియందు నేనే నిండియున్నాను. మణిహార మందలి సూత్రముగ నేనేయుండి మణులను హారముగ కూర్పు చేసినట్లు నేనీ సృష్టిని కూర్పు చేసి యున్నాను.

*వివరణము :* నా కంటె వేరేమియును లేదు. విశ్వమంతయు నేనే నిండి యున్నాను. నేను కాని దేదియు ఈ సృష్టిలో లేదు. అన్నిట అంతట నేనే యున్నాను. సమస్త రూపముల లోపల వెలుపల నేనే యున్నాను. అన్ని కోశములను, లోకములను, మండలములను సూత్రధారియై నేనే ధరించి యున్నాను. దారమున కెక్కించిన మణిపూసలు హారముగ గోచరించినట్లు, నేను అను సూత్రము ఆధారముగ అంతర్లోకములు, బహిర్లోకములు కూర్పు చేయబడి యున్నవి.

జీవుని యందలి సమస్త కోశములు 'నేను' ఆధారముగ కూర్పు చేయబడి యున్నవి. అట్లే సూర్యమండలములు, సవితృ మండలములు, భర్గోదేవ మండలములు చోటులో నిలిచి యుండుటకు సూత్రము నేనే. వానియందు నేనుండుట వలన అవి యున్నవి. నా ఉనికియే వాని ఉనికిగా గోచరించుచున్నది. నిజమునకు నేను లేక అవి లేవు. అవి లేకున్నను నేనున్నాను. వాని కస్తిత్వము కల్పించినది కూడ నేనే. వాస్తవమునకు దేనికిని తనదైన అస్తిత్వము లేదు. నా ఈ మహిమను తెలియుము. అనేకానేకమగు అలలు గోచరించు చున్నను వానియందు ఒకే సముద్రమున్నది. అలకు ప్రత్యేకమగు అస్తిత్వము లేదు. సముద్రమే అల యగుచున్నది. అల ఏర్పడుట, వృద్ధి చెందుట, ఉవ్వెత్తుట, సాగుట, మరల సముద్రమందు లయమగుట ఎట్లు జరుగుచున్నదో అట్లే ఈ జగత్తంతయు నా నుండి ఉద్భవించి, వృద్ధి చెంది, అటుపైన నాయందే లయ మగును.

కనుక అంతటా ఎట్టి మినహాయింపు లేకుండగ నన్నే దర్శింపుము. ఇతరములు దర్శించుట వలన మోహశోకములు కలుగును. సమస్త నామ రూపముల యందు, దేశ కాలముల యందు నన్నే దర్శించినచో మోహము విడిపోవును. శోకము కలుగదు. ఇది నిశ్చయము.

## 8

# ఈశ్వర దర్శనము

**రసోఽహ మప్సు కౌంతేయ ప్రభాస్మి శశిసూర్యయోః ।**
**ప్రణవః సర్వవేదేషు శబ్దః ఖే పౌరుషం నృషు ॥**

*తాత్పర్యము :* జలములలో రుచి, సూర్యచంద్రులలో కాంతి, వేదములలో ఓంకారము, ఆకాశమందు శబ్దము, మానవుల యందు పౌరుషము 'నేనే' అని తెలియుము ఓ అర్జునా!

*వివరణము :* ప్రకృతియందు ఈశ్వరుడెట్లు వర్తించు చున్నాడో తెలియుటయే విజ్ఞానము. అన్నిటియందు, అన్నిటిగాను ఉన్న దొక్కటియే యని తెలియుట జ్ఞానము. ఆ ఒక్కటిని ప్రకృతి యందు దర్శించి అనుభూతి చెందుట విజ్ఞానము.

ఈ అధ్యాయమున ఇప్పటివరకును మూడంశములు ఆవిష్కరింపబడినవి. ఈశ్వరుడు, పరాప్రకృతి, అష్ట ప్రకృతులు. ఇందొకదాని నుండి ఒకటి పుట్టినది. అన్నిటియందు ఈశ్వరు డున్నాడు. అన్నిటికి ఈశ్వరుడే ఆధారము. ఈశ్వరుడు లేక ఇతర ములు లేవు. వాని అస్తిత్వము ఈశ్వరుని అస్తిత్వమే. కనుక ముందు

శ్లోకమున నాకన్న వేరేమియును లేదు అని పలికినాడు. ఇపుడు తన నుండి ఏర్పడిన ప్రకృతి యందు తననెట్లు దర్శింపవచ్చునో తెలుపుచున్నాడు. అందుకొరకు ఉదాహరణము లిచ్చుచున్నాడు.

1. జలములు తమకు తాము రుచిగ నుండవు. నాలుక తనకు తాను రుచిగ నుండదు. కాని నాలుకపై జలము పడినపుడు రుచి వ్యక్తమగును. అట్లు వ్యక్తమైన రుచి అనుభూతి నిచ్చును. ఈ అనుభూతి ఈశ్వరుడే అని తెలియవలెను.

2. సూర్యుడు తనకు తాను కాంతి కాదు. అందలి కాంతిగ దర్శించు చున్నది కన్ను. కన్ను తనకు తాను కాంతి కాదు. కన్నుతో సూర్యుని చూచునపుడు  కాంతి అనుభూతి యగును. గుడ్డివాడు అట్టి కాంతి అనుభూతి పొందలేడు. సూర్యుడు, కన్నులు కలియుట వలన వెలుగు తెలియుచున్నది. ఇట్లు తెలియబడు వెలుగు 'నేనే' అని తెలుపుచున్నాడు. సూర్యునియందు, చూచువాని యందు కూడ తానే యుండుట వలన సూర్యుడు, కనులు కాంతివంత ముగ గోచరించు చున్నవి. కనుక ఎదుటివారి కన్నుల యందలి కాంతిని చూచునపుడు ఆ కాంతి దైవమని గుర్తించి దర్శించినచో అనుభూతి యుండును.

3. పై తెలిపిన విధముగనే చంద్రుని యందు కాంతిని గూడ ఆహ్లాదమగు ఈశ్వరుని యొక్క కాంతియే యని దర్శింప వచ్చును. చంద్రుని యందలి కాంతి చంద్రునిది కాదు. అది

సూర్యునిది. సూర్యుని యందలి కాంతి సూర్యునిది కాదు. అది సవితృమూర్తి కాంతి. సవితృమూర్తి యందు ప్రకాశించు కాంతి కూడ అతడిది కాదు. అది ఆదిత్యుని కాంతి. ఆదిత్యుని యందలి కాంతి అదితి నుండి అందివచ్చిన కాంతి. అదితి అవ్యక్త బ్రహ్మము యొక్క లేక ఈశ్వరుని యొక్క ప్రకాశము. కనుక ఇన్నిటి ద్వారా ప్రకాశించునది ఈశ్వరుడేయని తెలియవలెను. అట్లే జీవుల కనుల యందు ప్రకాశించునది కూడ ఈశ్వరకాంతియే. సృష్టియందలి వస్తువు లన్నిటి యందును ప్రకాశముగ ఈశ్వరుడే యున్నాడు. ఇట్లు దర్శించుట విజ్ఞానము.

4. వేదముల యందలి ఓంకారము 'నేను' అని ఈశ్వరుడు తెలిపినాడు. వేదమంతయు శబ్దమయము. శబ్దము లన్నియు నాదము నుండి పుట్టినవే. స్వయం ప్రకాశమగు అనాహత నాదమే ఓంకారము. నాదము బ్రహ్మము యొక్క అస్తిత్వమే గాని తనకు తానుగ నున్నది కాదు. ఈశ్వరుని యొక్క అస్తిత్వమే నాదము. దాని నుండి సమస్త సృష్టి జరుగుచున్నది. అట్టి నాదమును వినుట ద్వారా ఈశ్వర సాన్నిధ్యమును అనుభవింప వచ్చును.

5. ఆకాశమునకు శబ్ద గుణమున్నది. శబ్ద తరంగములు వినిపించుటకు చెవియున్నది. తరంగములు చెవిని సోకినపుడు వినబడుట అను అనుభూతి కలుగుచున్నది. ఆకాశము తనంతట తాను వినలేదు. చెవియును అట్లే. ఆకాశ తరంగములను, చెవిని

అనుసంధానము చేసి వినబడుటగ ఈశ్వరుడు వ్యక్తమగు చున్నాడు. ఇట్లు రుచి చూచుట, చూచుట, వినుట యందలి అనుభవము ఈశ్వరుడే అందించుచున్నాడు. ఇట్లే ఇతర తన్మాత్రలను కూడ అవగాహన చేసుకొనవలెను.

6. పురుషుల యందలి పురుషకారము నేనే. పౌరుషమును నేనే అని పలికినాడు. ప్రతి మానవుడును "నేను-తాను" అను చుండును. అట్లే నేనుగ, తానుగ నున్నవాడు ఈశ్వరుడే. ఈశ్వరుడే త్రిగుణముల ద్వారా జీవుడుగ మేల్కొనును. ఈశ్వర మాయ వలన తాను వేరుగ నున్నాడని అనుకొనును. పిండి నుండి రొట్టె లేర్పరచి నపుడు రొట్టె వేరుగ కన్పించునుగాని, నిజమునకది పిండియే కదా! పిండియే రొట్టెగ స్థితి మార్పు చెందినది. అట్లే ఈశ్వరుడే త్రిగుణముల ద్వారా పురుషుడుగ వ్యక్తమగుచున్నాడు. బ్రహ్మమే ఆత్మయగు చున్నాడు. కనుక ఏ పురుషుని చూచినను అతడు మూలమున ఈశ్వరుడే అని తెలియుట విజ్ఞానము.

ఇట్లు ఈశ్వర దర్శనము ప్రకృతి యందు పొందుచు ఆనందించుట ఈ అధ్యాయమున ఆవిష్కరింపబడుచున్నది.

## 9

# పుణ్య గంధములు

**పుణ్యో గంధః పృథివ్యాం చ తేజశ్చాస్మి విభావసౌ ।**
**జీవనం సర్వభూతేషు తపశ్చాస్మి తపస్విషు ॥**

*తాత్పర్యము :* పృథివియందు సుగంధము, అగ్నియందు తేజస్సు, జీవునియందలి జీవము, తాపసులలోని తపశ్శక్తి ''నేనే'' అయి ఉన్నాను.

*వివరణము :* పృథివి యందు దైవమును దర్శించుట అనగా సుగంధమును గుర్తించుట. ఎచ్చట సుగంధముండునో అచ్చట దైవము యొక్క అస్తిత్వమున్నదని తెలియవలెను. చందనము, కస్తూరి, సాంబ్రాణివంటి సుగంధములు భగవదస్తిత్వము మెండుగా కలవికాన వానిని ధరించుట, అలంకరించుకొనుట, గృహము లందుంచుకొనుట సత్సంప్రదాయమై వెలిసినది. అట్లే పసుపు కుంకుమలు కూడ. ఏ గృహమునందు సుగంధ పరివ్యాప్తి యుండునో ఆ గృహమున దైవసాన్నిధ్యము మెండుగ నుండును. అట్లే ఏ శరీరమునందు సుగంధము ఉండునో అట్టి శరీరము

పవిత్రముగ భావించవలెను. యోగుల యందు, తపస్విజనుల యందు అట్టి పరిమళము సహజముగ నుండును.

సుగంధము గల పుష్పములు కూడ అనేకములు గలవు. వాని సువాసనల బట్టి జీవుల ఆదరణ ముండును. సువాసన లేని పువ్వు అంతగా ఆదరణ పొందదు. కారణము అందలి సువాసనాబలమే. మల్లె, జాజి, గులాబి, సంపెంగ, చంపకము, పున్నాగము వంటి పుష్పములు చక్కని పరిమళములను వెదజల్లును గనుక వానికి పూజార్హత కలిగినది. ఇట్లు భౌతిక సృష్టి యందు ఏ పదార్థము నందైనను సుగంధమున్నచో దానిని భగవంతుని అస్తిత్వముగ నెరుగవలెను. ఎచ్చట సుగంధముండునో అచ్చట దైవమున్నాడని తెలియవలెను. దైవము నాహ్వానించుటకు సుగంధమును ముఖద్వారముగ మన ధర్మము తెలుపుచున్నది. శుభవాసనలున్నచోట దైవముండును. దైవమున్నచోట వెలుగు, జ్ఞానము, వికాసము ఉండును. సువాసనయే నేనని దైవము తెలుపుచున్నాడు గనుక ప్రయత్న పూర్వకముగ పుణ్య గంధముల నేర్పరచుకొనవలెను. ఇతర వాసనలను నిర్మూలించుకొనుచుండ వలెను.

అగ్నియందలి తేజస్సును దైవముగ భావించుట ఒక సాధన. తేజస్సును బట్టి ప్రకాశముండును. అమితమగు తేజస్సు అమితముగ ప్రకాశించి చూపరులకు వికాసము కలిగించును. అవరోధములు లేని తేజస్సును దైవముగ గుర్తించుట నేర్వవలెను. సృష్టియందలి దైవమును చూచుట కిది మరియొక మార్గము.

తేజస్సు ఎచ్చట గోచరించినను అది దైవమే అని తెలియవలెను. పదార్థపు తెరలను చీల్చి ప్రకాశించునదే తేజస్సు. అది శుద్ధ చైతన్యము యొక్క వెలుగు. అది ఎందు గోచరించినను అందు దైవమును గుర్తించుట జరుగవలెను. కనుకనే సూర్యుని యందు, చంద్రుని యందు, జీవుల ముఖముల యందు, ప్రత్యేకించి కన్నుల యందు దర్శించుట సాధనగా ఏర్పడినది.

జీవులందరి యందు ప్రాణస్పందనముగ లేక జీవనముగ దైవమే యున్నాడు. కనుక ఎచ్చట ప్రాణమున్నను దానిని దైవము యొక్క అస్తిత్వముగ తెలియవలెను. ప్రాణముగల జీవులన్నిటికిని కదలిక కలదు. అట్టి కదలికను దైవముగ చూచుట నేర్వవలెను. ప్రాణమునుబట్టి ప్రాణుల రూపములు నిలచియున్నవి. ప్రాణుల యందలి ప్రాణ స్పందనముగ నున్న దైవమును చూచుట ఒక సాధన. పిచ్చుక కదలికలోను, జంతువుల తోకల కదలికలోను ఉన్న ప్రాణములో దైవమును దర్శించుట విజ్ఞానము. దైవమును దర్శించ గోరువానికి సృష్టి యందెల్లడలను దైవమే గోచరించునని, అట్లు గోచరించుట విజ్ఞానమని తెలియవలెను.

తపస్విజనులలో తపస్సు చేయవలెనను సంకల్పముగ దైవమున్నాడు. ఎవరు తపస్సు చేయదలచినను ఆ తలంపుగ నున్నది దైవమే అని గుర్తింపవలెను. నవ విధ భక్తులకు వెనుకగల సంకల్పముగ దైవమే యుండి జీవులచే నిర్వర్తింపజేయును. దానిని గుర్తించి అనుసంధించుట సాన్నిధ్యము కలిగించును.

## (10)

# విచక్షణ - వివేచన

**బీజం మాం సర్వభూతానాం విద్ధి పార్థ సనాతనమ్ ।**
**బుద్ధి ర్బుద్ధిమతా మస్మి తేజ స్తేజస్వినా మహమ్ ॥**

*తాత్పర్యము :* ఓ పార్థుడా! నన్ను సనాతనునిగను, సర్వభూతములకు మూలముగను ఎరుగుము. బుద్ధిమంతులలో బుద్ధిగనున్నది నేనే. తేజోవంతులతో తేజస్సుగ నున్నది నేనే.

*వివరణము :* సనాతను డనగా తుది మొదలు లేక ఎప్పుడునూ ఉండునది. అది ఆధారముగనే అన్నియును ఏర్పడుచుండును. దాని కాధారమైన దేదియు లేదు. అది లేనిచో ఏమియు ఉండదు. దానికి లేకపోవుట యుండదు. ఇతరము లున్నను లేకున్నను తానుండును. దానిపైననే కాలము, ప్రకృతి, శక్తి ఆధారపడి యున్నవి. దానినుండియే సమస్తము పుట్టి పెరిగి నశించి దాని లోనికే పోవుచుండును.

భూతము లనగా పుట్టునవి. 'నేను' అను తత్త్వము ఎప్పుడును ఉండునది. దానినుండే పుట్టుట, అది ఆధారముగనే పెరుగుట,

దాని ఆధారముతోనే చక్రభ్రమణమున వచ్చిపోవుట జరుగుచుండును. అట్టి దానిని 'నేను' అని పలుకుదురు. నిజమునకు జీవులు 'నేను', 'నేను' అనుచుందురుగాని తామనుకొనుచున్న 'నేను' లన్నియు సనాతనమైన 'నేను'పై ఏర్పడిన బుడగల వంటివి. అట్టి చిల్లర నేను లన్నిటికిని మూలమగు 'నేను' సమస్తమునకు మూలము.

విత్తనమునందు మొలచుట అను శక్తిగ కూడ 'నేనే' యున్నాను. అంకుర శక్తి కారణముగనే విత్తనము మొలకెత్తుట, మొక్కయగుట, ప్రమానుయగుట, శాఖోపశాఖలుగ విస్తరించుట జరుగుచుండును. ఇట్టి శక్తి అదృశ్యమైనపుడు ఎంతటి మహా వృక్షమైనను నేలకు ఒరిగిపోవును. వృక్ష సంపద అందరము చూతుముగాని, అందలి అంకురశక్తిని గుర్తించము. ఒకవేళ అంకురశక్తిని గుర్తించినను అది దైవమను భావము కలుగదు. అంకురశక్తి ఉండుట లేకుండుట వలన, వృక్ష ముండుట జరుగుచుండును. అంకుర శక్తిని గ్రహించవలసినదే గాని చూపునకు కనిపించునది కాదు. కనుక గ్రహించుటయే చూచుట. అట్లు గ్రహించుటయే వృక్షములందలి దైవమును దర్శించుట. అదియే విజ్ఞానము. నామరూపాత్మకమగు సృష్టికి ఆధారముగ నున్న దానిని, నామరూపముల ద్వారమున చూచుటయే విజ్ఞానము.

మానవుల బుద్ధియందు హెచ్చు తగ్గులుండును. బుద్ధి బలమును బట్టి వికాసము, ప్రకాశము ఉండును. ఇట్టి విచక్షణ,

వివేచన శక్తిగ ఉన్నది దైవమే. అది ఎంత నిండుగ యుండిన అంత జీవుడు ప్రకాశించును. జీవుడు వృద్ధి చెందును, సుఖపడును. బుద్ధిమంతులు బుద్ధి తమది అనుకొందురు. సత్యమేమనగ, బుద్ధిగ దైవమే యున్నాడని తెలియుట. సమయమునకు సరియగు తలంపు తోచుట జీవుని వశమునగాక దేవుని వశమున యున్నదని తెలియవలెను. సమయస్ఫూర్తి దైవానుగ్రహమేగాని వ్యక్తిగతమగు ప్రతిభ కాదు. తనయందలి సద్బుద్ధి భగవదనుగ్రహముగను, సాన్నిధ్యముగను తెలియుట విజ్ఞానము. తనదనుకొనుట అజ్ఞానము.

అట్లే మానవులలో కొందరు తేజోవంతులుగ నుందురు. ఇట్టివారు కాంతివంతమగు కనులు కలిగియుందురు. ముఖము ఆకర్షణీయముగ నుండును. ఫాలము విశాలమై యుండును. వారి మాటలు చేతలు వశీకరణశక్తి కలిగియుండును. ఇట్టి ముఖములను, చూపులను, మాటలను చూచునపుడు విను నపుడు దైవమును దర్శించుచు ఆనందించుట విజ్ఞాన మగును. సత్పురుషులయందు, తపస్విజనుల యందు ఇట్టి తేజస్సును దర్శించుట ప్రధానమని భావింపవలెను. బుద్ధిబలము, తేజో బలముగ జీవులయందు ప్రకాశించు 'నన్ను' దర్శింపుమని దైవము తెలుపుచున్నాడు.

(11)

# ధర్మకాముడు

**బలం బలవతాం చాహం కామరాగ వివర్జితమ్ ।**
**ధర్మావిరుద్ధో భూతేషు కామోఽస్మి భరతర్షభ ॥**

*తాత్పర్యము :* కామము, రాగము వర్జితమైన బలముగ బలవంతులలో నన్ను దర్శింపుము. అట్లే ధర్మమునకు విరుద్ధము కాని కామముగ నేనే యున్నానని తెలుసుకొనుము.

*వివరణము :* బలమనేక రకములుగ నుండును. దేహ బలము, యింద్రియబలము, మనోబలము, బుద్ధిబలము, ఆత్మ బలముగ బలమున శ్రేణులున్నవి. అట్లే అంగబలము, ధన బలము, పదవీబలము, దైవబలముగ కూడ బలము కనిపించును. బలము త్రిగుణాత్మకముగను కూడ నున్నది. అనగ తమోబలము, రజోబలము, సత్త్వబలముగ గోచరించు బలమున్నది. ఇవి యన్నియును గాక మమకారము, వ్యక్తిగత కామము లేక నిర్మల ముగ వెలుగొందు బలమున్నది. అదియే నిజమగు దైవము. మమకారము, కోరిక, రజస్సు, తమస్సు, సత్త్వము ఇత్యాదివి బలమునకు దోషము కలిగించును. అట్టి బలము శుద్ధబలము

కాదు. రజోబలము, తమోబలముతో అసురు లనేకమార్లు నశించిరి. సత్త్వబలముగల దేవతలు కూడ పలుమార్లు భంగపడిరి. ఇతర బలముల గూర్చి తెలుప నవసరమే లేదు. మంత్ర బలముతో, తంత్రబలముతో కూడ భంగపడిన వారున్నారు. తపోబలము, యోగబలము కూడ అపుడపుడు పొరపడుటకు లోనైనది.

ఎచ్చట బలమునకు కామ సంగము, రాగ సంగము కలుగునో అట్టి బలము అసంపూర్ణమై భంగపాటు కలిగించును. అట్టి సంగ దోషములేని బలమే బలమని, అట్టి బలముగ నేనున్నానని భగవానుడు తెలుపుతున్నాడు. అట్టి బలము గలవాడే నిజమగు బలవంతుడు. అట్టి బలవంతుని బలముగ దైవమే యుండుట వలన అది పరిపూర్ణమై పతనమునకు తావీయక యుండును. శ్రీరాముని బలమట్టిది. ధర్మజుని బలమట్టిది. హరిశ్చంద్రాదుల బలమట్టిది. వారిబలమున కామమునకు గాని, రాగమునకు గాని తావులేదు.

అట్లే ధర్మకామము కూడ 'నేనే' అని భగవంతుడు ప్రకటించు చున్నాడు. కామము పతన కారణమని శుష్కవేదాంతులు ఘోషించుచు నుందురు. కామము లేనిదే సృష్టియే లేదు. దైవము నకు కామేశ్వరుడని, కామేశ్వరియని, కామ జనకుడని ఋషులు నామ మిడినారు. కామము పాపము కాదు. అది ధర్మవిరుద్ధ మైనపుడు జీవుని బంధించును. ధర్మయుక్త మైనపుడు జీవునికి

పరితుష్టి కలిగించును. ధర్మకామములు నిర్వర్తించుకొనుటకు దైవము తోడుగనే యుండును. కామమునందలి ధర్మము దైవమే. అందువలన కోరిక కలిగినపుడెల్ల ధర్మమా, కాదా అని నిష్కర్షగ విమర్శించుకొని ధర్మమే అయినపుడు నిర్వర్తించుట సముచితము. అట్టి కామ పూరణమునకు దైవము తోడై నిలచును. "నేను ధర్మ కాముడను" అని దైవము పలుకుటలో సందేశమిదియే.

(12)

# త్రిగుణములు

**యే చైవ సాత్త్వికా భావా రాజసా స్తామసాశ్చ యే ।**
**మత్త ఏవేతి తాన్విద్ధి న త్వహం తేషు తే మయి ॥**

తాత్పర్యము : సాత్త్విక, రాజస, తామస భావము లన్నియు నేనాధారముగనే కలుగుచున్నవి. కాని వానియందు నేను లేను. నా యందు అవి యున్నవి.

వివరణము : శుద్ధ చైతన్యము సత్యమునుండి ఉద్భవించి, సత్యమాధారముగ ప్రకాశించుచు నుండును. అట్టి శుద్ధ చైతన్యము నుండి త్రివిధములుగ భావము లుద్భవించు చుండును. అవి వరుసగా సాత్త్వికము, రాజసము, తామసముగా తెలుపబడినవి. ఈ భావముల వలన జీవులు వివిధముగ ప్రవర్తించుచుందురు. అందు సాత్త్విక భావన నిర్మలమై సుఖము లిచ్చును. రాజస భావన ఉగ్రమై పట్టుదలలతో కూడి తీవ్రముగను, ఆగ్రహముగను యుండును. అట్లే తామస భావము సోమరితనము, అశ్రద్ధ, నిర్లక్ష్యము, అశుచితో కూడియుండును. ఈ మూడు గుణముల

వివరములు రాబోవు అధ్యాయములలో చాల వివరముగ తెలుప బడినది. ఈ వైవిధ్యముతో కూడిన భావములకు లోనైనవారు జీవితమున ఒడుదొడుకులకు లోనగుచుందురు. ఈ మూడు గుణముల అల్లికగనే వైవిధ్యముతో కూడి జీవులు వర్తింతురు. ఈ భావములకు అతీతముగ చైతన్యమున్నది. చైతన్యమున కాధార ముగ సత్యమున్నది. సత్యమనగా అస్తిత్వమే. అనగా ఉండుటయే. ఉండుట సత్యము. అది ఆధారముగ చైతన్యము ఉద్భవించి, కొంతకాలమునకు మరల చైతన్యము సత్యములోనికి ఇమిడి పోవును.

అట్టి సత్ చిత్ ఆధారముగ త్రిగుణములున్నను అవి సత్యమునకు, చైతన్యమునకు లేవు. కాని త్రిగుణములకు అవి యున్నవి. విద్యుత్ పరికరము పనిచేయుటకు విద్యుత్ ఆధారము. విద్యుత్తు లేనిదే పరికరము పనిచేయదు. విద్యుత్తు ఆధారముగ నున్నపుడు వివిధ పరికరములు వివిధములుగ పనిచేయును. పనియందలి వైవిధ్యము పరికరమునదే. కాని పనిచేయుట విద్యుత్తు లేనిదే జరుగదు. అట్లే త్రిగుణములు కూడ. సత్ చిత్‌లు లేనిదే గుణములు పనిచేయవు. కాని గుణ వైవిధ్యమునకు సత్ చిత్‌లు కారణము కాదు.

మరియొక ఉదాహరణ : గదిలో లైటు వెలిగియున్నపుడు కొందరు సద్గ్రంథము పఠింతురు. కొందరు భాషణము, వివాదము,

సరస సల్లాపములు చేయుదురు. కొందరు చీట్లపేక ఆడు కొందురు. ఇవన్నియు వెలుగు ఆధారముగ జరుగుచున్నవి. కాని ఆయా పనులను వెలుగు చేయుట లేదు. వెలుగులో జరుగు చున్నవి. జీవుల స్వభావమును బట్టి వివిధములుగ జరుగుచున్నవి. ఆ వివిధత్వము గుణములకు సంబంధించి యున్నది. వానికి దైవ మాధారమే కాని కారణము కాదు.

మరియొక ఉదాహరణ : ఒక వెండితెరపై పౌరాణికము, సాంఘికము, విప్లవాత్మకము అగు సినిమాలు చూపించవచ్చును. కాని అందేవియు వెండితెర కంటవు. ఎంతకాలమైనను ఎన్ని రకముల సినిమాలు ప్రదర్శింపబడినను వెండితెర వెండితెరగనే యుండును. సినిమాలలోని ఘట్టములతో వెండితెరకు సంబంధము లేదు. కాని వెండితెర లేనిదే సినిమాలు ప్రదర్శింపబడవు.

అట్లు గుణముల కాధారముగ తానున్నానని, అవి తన యందు వర్తించుననియు, కాని అవి తనకు లేవనియు, దైవము ఈ శ్లోకమున స్పష్టము గావించినాడు. దీనిని శ్రద్ధతో అవగాహన చేసుకొనుట వలన విజ్ఞానము మెండుగా వికసించును.

(13)

# జ్ఞానము

**త్రిభి ర్గుణమయై ర్భావై రేభి స్సర్వ మిదం జగత్ ।**
**మోహితం నాభిజానాతి మా మేభ్యః పర మవ్యయమ్ ॥**

*తాత్పర్యము :* సర్వ జగత్తును పై తెలిపిన త్రివిధ గుణమయ భావములచే మోహము చెంది, అవ్యయము, పరము అయిన నన్ను తెలుసుకొనలేకపోవు చున్నది.

*వివరణము :* మూడు గుణముల అల్లికచేత ఏర్పడినది ఈ జగత్తు. అందలి ప్రాణులన్నియు మూడు గుణముల భావములచే ఈ జగత్తున మోహితులై యుందురు. అట్లు మోహము చెందిన వారికి గుణముల కతీతముగ నున్న సత్ చిత్ ఆనంద స్వరూపుడగు దైవము తెలియుటకు వీలు లేకున్నది. త్రిగుణములకు ఆధారమైన వాడు, త్రిగుణముల కతీతముగ నున్నాడు. త్రిగుణమయ భావము లతో నున్నవారికి తదతీతమగు తత్త్వము గ్రహింపునకు రాదు. వ్యక్తిగత సంకల్పములతో జీవితమునంతను తీరుబడిలేక గడుపు వారికి తమ సంకల్పముల కతీతముగ, తమయందున్న చైతన్య మును గుర్తింపరు గదా! వెండితెరపై జరుగు ఉత్కంఠభరితమైన

సినిమాను చూచువానికి వెండితెర జ్ఞప్తి యుండదు. కాని వెండితెర లేనిదే సినిమా లేదు. ప్రతి జీవునికి తమ సంకల్పములకు ఆధార ముగ నున్న చైతన్యమును గూర్చి విచారము చేయుటకు సమయ ముండదు. సంకల్పముల యందే తిరుగాడుచు నుండును. తన సంకల్పమునకు మూలమగు చైతన్యమును దర్శించు జిజ్ఞాస యుండదు. తాను చైతన్య వంతుడుగ నున్నపుడే తనయందు సంకల్పము లేర్పడుచున్నవి. తానుండుట మరియు చైతన్య వంతుడుగ నుండుట అనునది ప్రాతిపదికగ తనయందు సంకల్పము కలుగుట, దానిని నెరవేర్చుకొను ఇచ్ఛ కలుగుట, తదనుగుణమగు జ్ఞానమును పొందుట, అట్టి జ్ఞానముతో క్రియకుద్యమించుట జరుగును. ఇట్టి ఇచ్ఛా జ్ఞాన క్రియల వెనుక వ్యక్తిగత సంకల్పమున్నది. ఆ సంకల్పము వెనుక శుద్ధ చైతన్య వంతుడుగ తానే యున్నాడు. ఇట్టి తనను తనకు తెలియక, తన భావములే తానుగ జగత్తున జీవుడు తీరుబడిలేక తిరుగుచు నుండును.

తమ భావములయందలి మోహమే తమనట్లు త్రిప్పుచు నుండుగ, తాను, నేను అను ప్రజ్ఞ మరుగునపడి జ్ఞప్తిని కోల్పోవును. ఈ జ్ఞప్తిని పొందుటయే జిజ్ఞాసువు కర్తవ్యమై యున్నది.

సృష్టి పంచరంగుల రుమాలు వంటిది. అట్టి రుమాళ్ళ కాధార మైన పత్తి రుమాలును చూచునపుడు గుర్తుండకపోవుటయే మాయ. గుర్తు తెచ్చుకొనుటయే జ్ఞానము.

(14)

# నర-నారి తత్త్వము

దైవీ హ్యేషా గుణమయీ మమ మాయా దురత్యయా ।
మామేవ యే ప్రపద్యంతే మాయా మేతాం తరంతి తే ॥

*తాత్పర్యము :* నా మాయ దైవ సంబంధమైనది. దాని స్వరూపము త్రిగుణ స్వరూపము. అది నా ప్రకృతి. దానిని దాటుటకు శక్యము కాదు. కాని ఎవరు నిరంతరము గుణముల కతీతుడనైన నన్ను జ్ఞప్తి యందుంచుకొని శరణు వేడెదరో వారు నా మాయను దాటగలరు.

*వివరణము :* సత్యము, చైతన్యము (ఉనికి, మెళకువ) ఆధారముగ ప్రకృతి, సత్త్వము, రజస్సు, తమస్సు అను మూడు గణములచే సృష్టి అల్లిక చేయును. అన్నిటి యందును సత్ చిత్‌లు మూలముగ నుండును. వాని మరుగు పరుచుచు మూడు గుణముల అల్లిక విన్యాస ముండును. ఈ అల్లిక అమిత ఆకర్షణీయమై యుండును. నిత్యనూతనముగ నుండును. మనసేంద్రియములకు ఆనందము, ఆహ్లాదము, తదనుగుణమగు భ్రమను కలిగించును. నిజమునకు అందలి అంశములు ఐదు మాత్రమే! సత్యము (ఉనికి), చైతన్యము (మెళకువ, కదలిక), సత్త్వము,

రజస్సు, తమస్సు. ఇందు సత్ చిత్‌లు నర-నారీ స్వరూపము. వాని కంబరములుగ మూడు గుణముల స్వభావము, రూపము ఉండును. చూచువారలకు ఆ మొత్తమొక వస్తువుగ, రూపముగ గోచరించును. లౌకిక వ్యవహారమున దానికొక నామ మేర్పడును. ఆ నామమునకు, ఆ రూపమునకు సంబంధితమగు సమాచార ముండును. చూచువారలు కేవలము నామరూపాదులను, దానిని గూర్చి తమకు తెలిసిన సమాచారమును గుర్తింతురు. కాని ఆ రూపము త్రిగుణములచే అల్లబడినదనిగాని, ఆ త్రిగుణముల కాధారముగ యున్న నర-నారీ స్వరూపము జీవుడుగ నున్నాడని గుర్తించరు. గుర్తించుట విజ్ఞానము. నామ రూప సమాచారములకు పరిమితమగుట మాయ.

"ఇది కుక్క. ఇది పిల్లి. ఇది ఆవు. ఇది గేదె. ఈమె స్త్రీ. ఇతడు పురుషుడు. అది చెట్టు" అని నిత్యము మానవులు పలుకు పదములలో ప్రతి ఒక్క వస్తువునందును సత్ చిత్‌లు, మూడు గుణములు ఉన్నవి. అట్లు గమనించినచో నర-నారీ తత్త్వమే వైవిధ్యమగు గుణమేళనము కారణముగ, వైవిధ్యమగు స్వభావము, రూపము కలిగియున్నవని తెలిసి, అన్నిటి యందును దైవమునే సాక్షాత్కరించుకొన వచ్చును. అట్లు చేయుట వలన జ్ఞానము విజ్ఞానమై భాసించును.

సామాన్యముగ జీవులు పై విధమగు లోచూపు లేకుండుట వలన కుక్క, పిల్లి, ఆవు, గేదె, మనిషి రూపములను, వాని స్వభావములను మాత్రమే గుర్తించుచు మాయలో పడుచుందురు.

"ఈమె నా భార్య, ఇతడు నా కుమారుడు, ఇది నా గుఱ్ఱము" అని భావించు సంబంధములేవియు ఆ వస్తువులలో నుండవు. అన్నిటియందు పై తెలిపిన ఐదు అంశములే యుండును. భార్య యందు భార్యాత్వము నిర్మాణమున లేదు. అది మన మేర్పరచు కొను సంబంధమే. ఆమెయందు గూడ తనయందువలె సత్ చిత్‌లు, మూడు గుణములు, తదనుగుణమగు స్వభావము రూపము మాత్రమే యుండును. గుఱ్ఱమునందు కూడ అవియే అంశములున్నవి. శత్రు మిత్రాదులయందు కూడ అవియే యున్నవి. స్వభావమున చిక్కిన మానవుడు ఇతరుల స్వభావమునే చూచును గాని, ఆ రూపమునందలి గుణములు, నర-నారీ తత్త్వములు చూడడు. ఇట్లు చూడకుండుట మాయ. చూడ గలుగుట జ్ఞానము. ఇట్లు సృష్టి యందలి దైవమును చూచుట విజ్ఞానము. సృష్టి కతీతమైనవాడు సృష్టియందు కూడ అన్ని కాలములందు, దేశము లందు, అన్ని రూపములందు చూపరులకు గోచరించుచునే యున్నాడు. అట్లు చూడగల్గుట నిత్య స్మరణము, శరణము నందున్న వారికే వీలగును. ఇతరులకు వీలు పడదు.

"నా మాయ నుండి తరించుటకు నన్నే స్మరించుము, శరణు పొందుము" అని భగవానుడు హితము పలికినాడు.

## 15

# అసుర భావములు

**న మాం దుష్కృతినో మూఢాః ప్రపద్యంతే నరాధమాః ।**
**మాయయాఽపహృతజ్ఞానా ఆసురం భావ మాశ్రితాః ॥**

*తాత్పర్యము :* దుష్కృత్యములు చేయువారు, మోహముచే మూఢత్వము పొందినవారు, నరులలో అధములు అపహరింప బడిన జ్ఞానము కలవారై, అసురభావముల నాశ్రయించి మాయను చిక్కి, నన్ను శరణు పొందలేకున్నారు.

*వివరణము :* దుష్కృత్యములు చేయుట స్వ పర భేదము తీవ్రముగా నున్నపుడు జరుగుచుండును. మోహమున్న చోట సత్య దర్శనముండదు గనుక మూఢులై ప్రవర్తింతురు. జ్ఞాన మపహరింప బడుటచేత తాను, ఇతరులు అను భేదము పటిష్ఠమై, హింసాది అధమ కృత్యములను నిర్వర్తించుచుందురు. ఇట్టి వారందరును అసుర భావము నాశ్రయించినవారే. రజోగుణ, తమోగుణ భావము లన్నియు అసురభావములే. అందు కామము, మోహము స్వేచ్ఛగ నుండును. కామము మోహమును పెంచగ, మోహము కామ మును పెంచుచు నుండును.

వీనికి పరిష్కారము సత్త్వగుణము నాశ్రయించుటయే. సత్త్వ గుణము తెల్లని కాంతివంటిది. రజోగుణము ఎఱ్ఱని కాంతి వంటిది. తమోగుణము కాంతివిహీనమగు వర్ణము గలది. చైతన్యము స్వచ్ఛముగ నున్నపుడు సత్త్వమై యుండును. స్వభావము సాత్వికమై యుండును. అట్లు కానపుడు కలతబారి యుండును. కలతబారిన చైతన్యమునకు ఉన్నది గ్రహించుట కష్టము. లేనిది ఉన్నట్లుగ కనిపించును. అంతయూ తికమకగ యుండును. అది కారణముగ అహంకార మమకారములతో, మోహ వికారములతో అంతయును పొరపాటుగ అర్థము చేసుకొనుట, మాటాడుట, ప్రవర్తించుట యుండును. దాని నుండి సమస్యలు పుట్టును. సమస్యలు పరిష్క రించు ప్రయత్నమున మరికొన్ని సమస్యలు పుట్టుచుండును. అపుడు విపరీత భావములు చోటు చేసుకొనును. అవియే అసుర భావములు. ఒకమారు అసుర భావమునందు చిక్కినచో బయల్పడుట కష్టము. అట్టివారే దైవమును తిరస్కరింతురు. తమ రూపమున దైవమే యున్నాడని తెలియక, దైవ చైతన్యమే తన సమస్త వ్యాపారమునకు ఆధారమని తెలియక కలుషితమైన స్థితిలో దైవమే లేడందురు. కనుక వానిని శరణు పొందు ప్రశ్నయే లేదందురు. తమకు తెలిసినదే జ్ఞానమందురు. ఇట్టి హిరణ్యా కశిపులు, రావణ కుంభకర్ణులు జగత్తున ఎప్పుడునూ ఉందురు.

అసుర భావముల నాశ్రయించుటచే జ్ఞానము పూర్తిగ మరుగున పడును. మాయపొర దట్టముగ కమ్మును. భావములు

మూఢత్వముతో కూడియుండును. అకృత్యములను, దుష్కృత్యములను, అధమాధమ కృత్యములను నిర్వర్తించుచు తమ జీవితమును అశాంతితో నింపుకొందురు. పరిసరములను కలవర పెట్టుచుందురు.

ఇట్టివారు జీవితమున తట్టుకొనలేని ఆపద తమకుగాని, తమ వారికిగాని సంభవించినపుడే పరిష్కారము పొందుదురు. వారిని గూర్చి తదుపరి శ్లోకమున వివరింపబడును.

(16)

# నాలుగు శ్రేణులు

**చతుర్విధా భజంతే మాం జనా స్సుకృతినోஉర్జున ।**
**ఆర్తో జిజ్ఞాసు రర్థార్థీ జ్ఞానీ చ భరతర్షభ ॥**

*తాత్పర్యము :* అర్జునా! సుకృతులైన జనులు మాత్రమే నన్ను భజింపగలరు. అట్టివారు నాలుగు విధములు. ఆర్తులు, అర్థార్థులు, జిజ్ఞాసువులు, జ్ఞానులు అని నాలుగు రకములుగ వారిని గుర్తింప వచ్చును.

*వివరణము :* సుకృతు లనగా శుభమగు కర్మలను చేయు వారు. ఏ మాత్రము సుకర్మము చేయనివాడు భగవంతుని భజించ లేడు. భజించవలెనను బుద్ధి పుట్టదు. ఎట్టి పుణ్యకర్మలు చేయక యున్నవాడు. వాని నాలుకపై భగవన్నామము ఉచ్చరింపబడదు. మనసు దైవమునందు విముఖమై యుండును. ఇది సత్యము. ఇట్టివారు అహంకారమునబడి కష్టనష్టములకు లోనగు చుందురు. అహంకారము కారణముగ ధర్మగతిని తప్పుదురు. జీవితమున తాముగ పరిష్కరించుకొనలేని, భరింపలేని దుఃఖములు సంభవించి

నపుడు కూడ వారిని వీరిని నిందింతురే కాని దైవము నాశ్రయించరు. కాని లేశమాత్రము పుణ్యకర్మ యున్నచో, అది కారణముగ లోనుండి దైవము నాశ్రయించు బుద్ధి కలుగును. అట్లాపదలు కారణముగ, సుకృతులు (అనగా పుణ్యకర్మ చేసినవారు) దైవమును స్మరించుట, నమస్కరించుట, భజించుట, ప్రార్థన చేయుట, ఊహించుటవంటి కార్యములందు ప్రవేశింతురు. బాధలనుండి విముక్తి చెందుటకై ఆర్తితో ప్రార్థింతురు. క్రమముగ దైవమును భజించుట ఒక సంస్కారముగ ఏర్పడి క్రమముగ దైవభజనము అభ్యాసమై నిలచి తారణమార్గము పట్టుదురు.

మరికొందరు దైవము సర్వశక్తివంతుడని నమ్మి తమ కోరికలు తీరుటకై, సంపదలు కలుగుటకై, సుఖములు పొందుటకై దైవము నారాధింతురు. ఇట్టి వారికి కూడ దైవారాధనము క్రమముగ ఒక సంస్కారమై, అభ్యాసమై అనునిత్యము దైవారాధన చేయుట యందు స్థిరపడును. వీరును క్రమమున తరింతురు. మరికొందరికి దైవ మననేమో తెలుసుకొను జిజ్ఞాస కారణముగ పెద్దల ఉప దేశమును పొంది దైవమును తెలియుటకై కుతూహలముతో దైవ స్మరణము, మననము, ధ్యానము, ఆరాధనమువంటి కార్యము లలో నిమగ్నులై, దైవభక్తులై తరింతురు. దైవమునందు కుతూహ లమే ప్రధాన కారణముగ వీరు దైవ భావ సామ్రాజ్యమున ప్రవేశింతురు. పై తెలిపిన రెండు శ్రేణుల వారికన్న వీరు దైవము

నకు ఎక్కువగ చేరువ కాగలరు. వీరికి దైవమునందు భయము కన్న ఆసక్తి మిన్నగ యుండును. వీరి భక్తియందు ఉత్సుకత యుండును. భయముండదు. ఇట్టివారు కాలక్రమమున త్వరిత గతిని జ్ఞానులై దైవముతో కూడియుండుట నేర్తురు.

ఇక నాల్గవ శ్రేణియగు జ్ఞానులు సర్వకాలముల యందు, సర్వదేశముల యందు, సర్వరూపముల యందు, సర్వ నామముల యందు దైవమునే దర్శించుచు, వినుచు, భాషించుచు రసాను భూతిని చెందుచు నుందురు. వీరికి అన్నిట, అంతట దైవమే నిండి దర్శనమిచ్చు చుండును.

ఇట్లు భక్తులలో స్థూలముగ నాలుగు శ్రేణులు యున్నట్లుగ భగవానుడు పలుకుచున్నాడు.

(17)

# నిత్యయుక్తుడు

**తేషాం జ్ఞానీ నిత్యయుక్త ఏకభక్తి ర్విశిష్యతే ।**
**ప్రియో హి జ్ఞానినోఽత్యర్థ మహం స చ మమ ప్రియః ॥**

*తాత్పర్యము :* పై తెలిపిన నాలుగు విధములగు భక్తులలో జ్ఞాని శ్రేష్ఠుడుగా నున్నాడు. అతడు నిరంతరము భావముచే నాతో కూడియుండుటచేత, ఏక భక్తుడగుటచేత అతడికి నే నత్యంత ప్రియుడుగను, నాకు అతడు అత్యంత ప్రియుడుగను అయి ఉన్నాము.

*వివరణము :* ఆర్తులు ఆపదలయందు దైవము నెక్కువగ ఆశ్రయింతురు. ఇతర సమయములలో తాముగ నుందురు. అనగ అహంకారులుగ నుందురు. తామే చేయుచున్నామని, తామే కర్తలమని, తామింతటి వారమని, అంతటి వారమని భావించుచు నుందురు. ఆపద కలిగినపుడు దైవమును గుర్తింతురు. ఆశ్రయింతురు. ప్రార్థింతురు. పరీక్షల ముందు, పరీక్షాఫలితముల ముందు ఆంజనేయుని గుడికి వెళ్లు పిల్లలవలె ప్రవర్తింతురు. ఇట్టివారు దైవముతో నిత్యము కూడియుండరు.

అర్థార్థులు అనగా జీవన ప్రయోజనముల కొరకై పాటు పడు వారు. ధనము కొరకు, కుటుంబ సౌఖ్యము కొరకు, సంతానము యొక్క అభివృద్ధి కొరకు, ఆస్తిపాస్తుల కొరకు దైవమును అర్థించుచు, ప్రార్థించుచు నుందురు. దైవముకొరకు దైవమును ప్రార్థించుట కాక, తమ అవసరముల కొరకు దైవమును ప్రార్థించుచు అర్థ ప్రాప్తితో తృప్తి చెందుచు నుందురు. ఆర్తులకు, అర్థార్థులకు దైవము కన్న వారి ఆపదలు, అవసరములు మనస్సున మిక్కిలిగ నుండును. వారి భక్తి, ప్రేమ దైవముపై కాక తమ సమస్యల పరిష్కారముపై యుండును. ఇట్టివారికి దైవము ఒక కామధేనువు. ఒక కల్ప వృక్షము. దైవమునుండి పొందుటయే వీరికి తెలియును గాని, దైవమును చేరుటకు, దైవమునకు తమను తాము సమర్పించు కొనుటకు సిద్ధపడువారు కాదు. ఇట్టి వారిని దైవమును నమ్ముకొను వారుగ గుర్తింప వచ్చును. కాని దైవము నచ్చినవారు కాదు.

దైవము నచ్చుట, దైవమును ప్రేమించుట అనునవి జరిగి నపుడు తమను దైవమునకు సమర్పించుకొనుట యుండును. నచ్చిన విషయములకు జీవుడు మనసు నర్పించుట యుండును. దైవము నచ్చినపుడు మనసు దైవము వైపునకు లాగుచుండును. క్రమముగ దైవమునకు సమర్పింపబడును. ఇతర విషయము లందు మక్కువచే మనసు ఇతరముల యందాసక్తి గొన్నట్లే దైవము నచ్చుట పరిణామక్రమమున జీవునికి కలిగి తీరును. దైవము నుండి ఏర్పడిన జీవుడు సృష్టియందు పరిపక్వత చెందుచుండగ,

కాలక్రమమున దైవమునుగూర్చి భావించుట, విచారించుట, అన్వేషించుట ఇత్యాదివి జరుగక మానవు. అపుడు ఆర్తుడు, అర్థార్థుడు అయిన జీవి జిజ్ఞాసువుగ పరిణతి చెందును.

జిజ్ఞాసువనగా దైవతత్త్వమును తెలుసుకొనవలెనని, దర్శించవలెనని, స్పర్శించవలెనని, భాషింపవలెనని కలిగెడి ఆరాటము. ఈ ఆరాటము తీవ్రమై దైవ అన్వేషణ మార్గముల అవిరామమగు కృషి సలుపుచు నుందురు. ఇట్టి వారిని దైవమే స్వయముగ నడిపించుచు నిర్దిష్టమగు మార్గమున ప్రవేశింపజేయుచు నుండును. అట్టి దైవ సంకల్పము కారణముగనే జిజ్ఞాసువులకు సద్గురువు లభించుట జరుగును. ఇట్టి జిజ్ఞాసువులు క్రమముగ భక్తి జ్ఞాన యోగ వైరాగ్యములందు పరిణతి చెందుచు కడతేరుదురు.

కడతేరిన జిజ్ఞాసువులే జ్ఞానులు. తాను దైవముకన్న వేరు కాదని, తనయందు తనవలె దైవమే యున్నాడని, అదే విధముగ అందరియందు, అన్నిటి యందు యున్నాడని తెలిసినవాడు జ్ఞాని. అతడు దృశ్యమాన జగత్తుయందు సర్వమున దైవమునే చూచుచు నుండును. దైవమునే వినుచు నుండును. దైవమునే స్పృశించుచు నుండును. దైవమునే ఆఘ్రాణించుచు నుండును. దైవమునే రుచి చూచుచు నుండును. అతడికి అన్నము దైవమే. తాను స్పృశించినదెల్ల దైవమే. తాను చూచుచున్నదెల్ల దైవమే. వినుచున్నదెల్ల దైవమే. అతడికి దైవము కాని దేదియు ఉండదు. తనయందు, తన పరిసరములయందు అంతయు దైవమే అని తెలిసి, దైవముతోనే

కూడి యుండును. ఇట్లెల్లపుడు దైవముతో కూడియున్నపుడు అతడిని నిత్యయుక్తు డందురు. కనుక జ్ఞాని నిత్యయుక్తుడని భగవానుడు పలికెను.

జ్ఞానియొక్క మరియొక లక్షణము ఏక భక్తి. ఏక భక్తి యనగా పరమగు సత్యమే వివిధములగు రూపాంతరములతో భాసించు చున్నదని తెలియుట. ఒక తత్త్వమే అనేకమై భాసించుచున్నదని తెలియుట. అతడే బ్రహ్మ. అతడే విష్ణువు. అతడే శివుడు. అతడే రాముడు. అతడే కృష్ణుడు. అతనినే అల్లా అని పిలుతురు. సూర్య చంద్రుల యందతడే ప్రకాశించు చున్నాడు. గ్రహతారకల యందతడే వర్తించుచున్నాడు. రూపములు, నామములు ఏమియైనను ఉన్నది ఒకటే. చీమ నుండి శివుని వరకు అన్నిటి యందున్నది ఒక్కటే. సచేతనములందు, అచేతనముల యందు కూడ ఉన్నది ఒకటే. ఆ ఒక్కటినే అన్నిటియందు దర్శించుచు, భజించుచు నుండుట ఏకభక్తి. అట్టి జ్ఞానికి మతములుండవు. వేరు వేరుగ దేవుని నామములు, రూపములు యుండవు. అన్నిటి యందొక్కటినే చూచును. అతడికి అల్లాయందు, క్రీస్తునందు, కృష్ణునియందు, అమ్మవారియందు, ఆంజనేయుని యందు, సమస్తమునందు ఒక్కటే గోచరించును. అది పరమగు సత్యము. అతని ధ్యానము కూడ అన్నిటికి మూలము, పరము అయిన సత్యమును గూర్చియే.

"*ఓం సత్యం పరం ధీమహి*" అనునది అతని భక్త సారాంశం.

ఇట్టి జ్ఞానికి దైవము తప్ప మరొకటి గోచరింపదు. అన్య ముండదు. ఆ ఒక్కటితోనే అన్నిటా, అంతటా ముడిపడి రమించుచు నుండును. అందరియందలి దైవమతని కిష్టుడై యుండును. అట్టివాడు దైవమునకు కూడ చాల ఇష్టుడు. కనుకనే, జ్ఞాని నాకిష్టుడని దైవము పలుకుచున్నాడు. జ్ఞానియనగ 'నేనే' అని మరియొకచోట పలికినాడు.

(18)

# ఉన్నత పదము

**ఉదారాః సర్వ ఏవైతే జ్ఞానీ త్వాత్మైవ మే మతమ్ ।**
**ఆస్థితః స హి యుక్తాత్మా మామే వానుత్తమాం గతిమ్ ॥**

*తాత్పర్యము :* చతుర్విధ భక్తులందరును ఉదారులే అయినను జ్ఞాని అయినవాడు నా స్వరూపమే అని నా అభిప్రాయము. ఎందు వలననగా అతడి ప్రజ్ఞ నాయందే సర్వకాలము లందు స్థిరముగా యుండి, నాతో కూడియుండుటయే ఉత్తమగతి అని భావించును.

*వివరణము :* ఆర్తులు, అర్థార్థులు, జిజ్ఞాసువులు సకారణ ముగ దైవముతో ముడిపెట్టుకొని యుందురు. జ్ఞాని అకారణముగ ముడిపడియుండును. దైవముతో ముడిపడుట వలన ప్రజ్ఞ ఊర్ధ్వ మగుచుండును. ప్రజ్ఞ ఊర్ధ్వమగుట జరుగుచుండగ స్వభావము ఉదారముగ మారుచుండును. ఉదారమనగ విశాలమని సామాన్య అర్థము. ఉన్నతి చెందుట అనునది విశేషార్థము. ఉన్నతత్వము వలన ఉదారత్వ మేర్పడును. దానము, ధర్మము అనుసరించు బుద్ధి ఏర్పడును. ఇట్లు నిజమగు దైవభక్తులందరును క్రమముగ ప్రజ్ఞయందు ఉన్నతి చెందుచు నుందురు. కనుక అందరును ఉదారులే.

కాని జ్ఞాని ఉన్నత పదముతో ముడిపడియుండుట చేత ఇక పొందవలసిన ఉన్నతత్వమేమియు లేక, దైవముతో స్థిరముగ కూడియుండును. దైవమునందే స్థిరపడిపోయెను. అట్టి వానికి, దైవమునకు భేదమేమియు నుండదు. అట్టి వానినే నడచుచున్న దైవమందురు. కనపడుచున్న దైవమందురు. అందుబాటులో నున్న దైవమందురు. "అట్టి జ్ఞాని నేనే అని నా అభిప్రాయము" అని భగవానుడు పలుకుచున్నాడు. సర్వకాల సర్వావస్థలయందు తన తోనే కూడియుండుటచేత, అయస్కాంతమును చేరిన ఇనుము అయస్కాంతమైనట్లు, నిత్యయుక్తుడగు భక్తుడు దైవమే యగు చున్నాడు. కనుక భగవంతుడు జ్ఞాని తనకిష్టుడని, అతడి రూపమున నేనే యున్నానని నిశ్చయముగ తెలుపుచున్నాడు.

జ్ఞాని ఎల్లప్పుడును తన లోపల వెలుపల వ్యాప్తి చెందిన దైవముతో కూడియుండుట వలన అతడి యందు దైవము ఉపస్థితుడై యుండుట సంభవించును. దైవము నందతడుండుట వలన అతనియందు దైవముండును. దైవమే అతడుగ నుండును. అతడు దైవమునకు అంగమైపోవును. వాహిక అయిపోవును. వాహనముగ మారిపోవును. అట్టివాని నుండి దైవమే చూచును. స్పృశించును. సంభాషించును. చూపులతో నవ్వులతో కూడ ప్రచోద నము గావించును. అట్టివానిగ తానే యున్నానని దైవము ప్రకటించెను.

(19)

# దుర్లభుడు

**బహూనాం జన్మనా మంతే జ్ఞానవా న్మాం ప్రపద్యతే ।**
**వాసుదేవ స్సర్వమితి స మహాత్మా సుదుర్లభః ॥**

*తాత్పర్యము :* అనేక జన్మల అనంతరము జ్ఞానియగువాడు సర్వము వాసుదేవమయమే అని గ్రహించి, నాయందు శరణు పొంది జీవించుచు నుండును. అట్టి మహాత్ముడు దుర్లభుడు.

*వివరణము :* జ్ఞానమార్గ మనగా అన్నిట, అంతట ఉన్నది దైవమే అని భావించుట. అతడే అనేకానేకమగు రూపములుగ గోచరించుచున్నాడని, అనేకానేక నామములు ధరించియున్నాడని భావన యందుండవలెను. అన్ని దేశములయందు, అన్ని కాలముల యందు అతనినే దర్శించుట నేర్వవలెను. కులము, మతము, జాతి, తూర్పు పడమరలు, ఉత్తర దక్షిణములుగ ముసుగులు వేసుకొని యున్నది ఒకే తత్త్వమని భావింపవలెను. అనేక శబ్దములు గను, రంగులుగను, తరంగములుగను, అంకెలుగను ఉన్నది దైవతత్త్వమే అని భావింపవలెను. అనేకానేక దేవతలు, మానవులు,

అసురులు, జంతువులు, వృక్షములు, ఖనిజములుగ అతడే ఏర్పడి యున్నాడని తెలుసుకొనుచుండ వలెను.

ఏమి చూచినను, ఏమి విన్నను, రుచి చూచినను, వాసన చూచినను, స్పృశించినను దైవమే అని తెలియవలెను. సుఖ దుఃఖములు, లాభనష్టములు, సౌకర్యా సౌకర్యములు, భోగములు రోగముల యందుగూడ దైవమునే దర్శించుట నేర్వవలెను. దైవముకాక మరియొకటి లేదని అంతఃకరణమున నిశ్చయముగ భావించి అనుభవించుచు నుండవలెను.

ఇట్టివాడే ఏక భక్తుడు. అనగ ఒకే తత్త్వమును సర్వకాలముల యందు, సర్వదేశములయందు, సర్వ అవస్థలయందు, సర్వ రూపముల యందు దర్శించుచు నుండుట. ఇట్లు దర్శించుట వలన తత్త్వముతో నిత్యము కూడియుండుట ఏర్పడును. ఏకభక్తి వలన నిత్యయుక్తత ఏర్పడును. నిత్యయుక్తత వలన తత్త్వము రుచించు టారంభమగును. తత్త్వదర్శనమే ప్రియమగును. అట్టి వాడు తత్త్వమునందు ప్రీతిగలవా డగుటచే సృష్టి పొరలన్నిటి యందును తత్త్వమును దర్శించును. పదార్థము నుండి పరమాత్మ వరకు గల అన్ని పొరల యందును తత్త్వమునే దర్శించుచు, ప్రీతి చెందుచు, దానితో కూడి ఆనందించుచు జీవించును.

తత్త్వముతో సతతము కూడియుండుట వలన క్రమముగ అన్నిటియందు తత్త్వమే గోచరించి తత్త్వజ్ఞుడుగ మారును. అనగా తత్త్వమే రూపముగ కలవాడగును.

పై విధమగు స్థితి చేరుటకు కొన్ని జన్మలు పట్టవచ్చును. అయినను ఇది సూటియగు సాధన. కనిపించు వినిపించు సృష్టిని దైవముగ చూచు చుండుట వలన, దైవములేని చోటు, కాలము లేదని తెలిసి అంతయు దైవమే అని తెలియుట జరుగును.

అట్లు కాక ఒక నామమునకు, మరొక రూపమునకు, ఒక కాలమునకు, ఒక దేశమునకు, ఒక సిద్ధాంతమునకు, ఒక మతము నకు పట్టుపడినవారు తత్త్వదర్శనము చేయలేరు. విశ్వరూపుని చూడలేరు. విశ్వమే రూపముగా గల వాసుదేవ తత్త్వమును దర్శింపలేరు. దైవనామము పేరున, రూపము పేరున, మతము పేరున, సిద్ధాంతము పేరున కీచులాడుకొను వారికి తత్త్వదర్శనము దుర్లభము. వారేర్పరచుకొన్న పరిమిత భావములనే పరిమితమైన రూపమున, నామమున దైవమును దర్శించితిమని భ్రమయందు పడి ఇతరులను కూడ అట్టి భ్రమలోనికి నెట్టుచు నుందురు. అపరిమితమగు తత్త్వమును వ్యక్తిగత పరిమితులలో ఇముడ్చు కొనుట వలన సాధకుడు పరిమితుడే యగును. అపరిమితత్త్వము లోనికి ఎదుగుట జరుగదు.

అట్లుకాక అపరిమిత తత్త్వములోనికి తాను ఇమిడిపోవుటకే ఏకభక్తి, నిత్యయుక్తత, తత్త్వ ప్రియత్వము భగవానుడు బోధించు చున్నాడు. ఈ మార్గమున సాధన చేయువాడు త్వరితగతిని ఉన్నతి చెంది, సమస్తము నందున్నది ఒక్కటియే అని తెలిసి,

దానితో అవినాభావము పొంది, శాశ్వతుడై నిలచును. అట్లు జరుగుటకు కొన్ని జన్మలు పట్టినను అతను తత్త్వరూపుడై వెలుగుచునుండును. అట్టివాడు దుర్లభుడని కూడ భగవానుడు తెలుపుచున్నాడు. అట్టివారే ప్రహ్లాదుడు, అంబరీషుడు, హనుమంతుడు, బలి, గోపికలు. వారికి అన్యమేమియు కానరాదు. వారిదనన్య జ్ఞానము, అనన్య భక్తి.

(20)

# హృతజ్ఞానులు

కామై స్తైస్తైర్హృతజ్ఞానాః ప్రపద్యంతే ఽ న్యదేవతాః ।
తం తం నియమ మాస్థాయ ప్రకృత్యా నియతా స్స్వయా ॥

*తాత్పర్యము :* తమదైన ప్రకృతిచేత నియమింపబడినవారై కామవాంఛల చేత జ్ఞానము కోల్పోయి, కోరికలు తీరుటకు ఇతర దేవతలను జీవులు ఆరాధించు చుందురు.

*వివరణము :* దివ్య ప్రకృతి ఒకటి యుండగ కోరికలు కారణముగ ప్రతి జీవుడు తనదైన ప్రకృతిని ఏర్పాటు చేసుకొనును. దివ్య ప్రకృతి యందు ఇచ్ఛ, జ్ఞాన, క్రియా శక్తులున్నవి. ధర్మము ననుసరించుచు, కర్తవ్యములను నిర్వహించు జీవులందరిని దివ్య ప్రకృతియే పోషించుట, రక్షించుట, వృద్ధి కలిగించుట, తుష్టి, పుష్టి నేర్పరచుట చేయును. ధర్మము, కర్తవ్యము అనుసరించు వారికి తమదైన ఇచ్ఛలు కోరికలు యుండవు. జీవుని ఇచ్ఛ ధర్మము ననుసరించి యున్నచో ప్రకృతి యందు బంధింపబడడు. ధర్మముతో కూడని ఇచ్ఛ నిర్వహించుట వలననే జీవుడు సృష్టియందు బంధితుడగు చున్నాడు. *"స్వయా, ప్రకృత్యా నియతాః"* అని శ్లోకమున

చెప్పబడినది. అనగా తమదైన ప్రకృతిచే నియమింపబడిన వారని అర్థము. దివ్యమగు ప్రకృతి ప్రణాళిక ఒకటి యుండగ, అందు వసించు జీవుడు తనదైన ప్రకృతిని ప్రవేశపెట్టుట వలన, ప్రకృతిలో ప్రకంపనలు కలిగి, మరల అతనినే తాకును.

ఉదాహరణకు ఒక నిర్మలము, నిశ్చలము అగు తటాకమున స్వేచ్ఛతో ఒక బెడ్డ విసిరినచో, బెడ్డ పడ్డ చోటునుండి వృత్తాకారము లుగ తరంగములు పుట్టి, ఒడ్డునకు చేరి, మరల తీరమునుండి బెడ్డపడ్డ చోటుకు వృత్తాకారముగ చేరును. ఇట్లు ధర్మవ్యతిరిక్తమగు కోరికలు తుదకు కోరిన వారిని బంధించును.

కనుకనే భగవద్గీతయందు నిష్కామకర్మ, కార్యం కర్మ బోధింప బడినవి. కార్యం కర్మ అనగా తాను నిర్వర్తించవలసిన కర్తవ్యము. తాను చేయవలసిన పని. అది ఎప్పుడును ధర్మమును కూడి యుండును. చేయవలసినదికాక, చేయదలచినది కామ్యకర్మ అగును. అట్టి కామ్యకర్మలు జీవుని బంధించును.

కామ్యకర్మలు బంధకారణములని తెలియక పోవుటయే అజ్ఞానము. అట్టివారినే హృతజ్ఞాను లందురు. హృతజ్ఞానులనగా కోల్పోయిన జ్ఞానము కలవారు. కర్తవ్యములను విస్మరించి, కోరికల వెంటబడి పరువెత్తు వారందరును అజ్ఞానులే!

ఇట్టి అజ్ఞానులు తమదైన కోరికలను నిర్వర్తింప జేసుకొనుటకు అనేకానేక దైవరూపములను ఆరాధించుదురు. ఆంజనేయునకు గారెలు, అప్పములు; గణపతికి ఉండ్రాళ్ళు; విష్ణువుకు చక్రపొంగలి;

శివునికి కొబ్బరన్నము; అమ్మవారికి పాయసము, పులిహోర; అందరికిని కొబ్బరికాయలు, అరటిపండ్లు తినిపించి తమ కోర్కెలను నెరవేర్చుకొన జూచెదరు. అట్లే గిరి ప్రదక్షిణములు, కొండలెక్కుట, పాదయాత్రలు చేయుట, శిరోజముల నర్పించుట, పొర్లు దండ ములు పెట్టుట, చన్నీటి స్నానములు చేయుట, చాపపై పడు కొనుట, దీక్షావస్త్రములను ధరించుట కూడ నేర్తురు. కోరికలు అంతరంగమున ఉంచుకొని పై విధమగు నియమములను పాటించుచు, తాము నమ్మిన దేవతలు తమ కోర్కెలు తీర్తురని భావించు చుందురు.

కోరికలు తీరుట తీరకపోవుట జీవులు చేసిన పుణ్య పాప ములు బట్టి యుండును. పై విధమగు దేవతారాధనలు చేయు చున్నను ఒక్కొక్కమారు కోరికలు సిద్ధించుట, ఒక్కొక్కమారు సిద్ధించకపోవుట కూడ జరుగుచుండును. సిద్ధించినపుడు దేవుడు కరుణించినాడని, సిద్ధించనపుడు ఆగ్రహముగ నున్నాడని, కరుణ మానినాడని అనుచు, దుఃఖ తీవ్రతను బట్టి నిందించుచు కూడ యుందురు. ధర్మము ననుసరించి కార్యములు సిద్ధించుట సిద్ధించకపోవుట, పూర్వ కర్మమును బట్టి ఫలించుట ఫలింపక పోవుట యుండునని తెలియక, కోరికలను బట్టి ఆరాధనలు చేయువారు అజ్ఞానులు.

కర్ణుడు అనునిత్యము శ్రద్ధాభక్తులతో సూర్యారాధనము చేసినవాడు. కాని అతని కర్మము, అతడాచరించిన అధర్మమే బలీయమై అపజయము, అపఖ్యాతి పొందినాడు. కౌరవులతో

కూడి అధర్మము నాచరించుట వలన, తనయందు సహజముగ గల అసూయ వలన అతడంతరించినాడు. ఆరాధనా ఫలము మరొక విధముగ ఆశీర్వచనమై నిలచినదే కాని, అర్జునుని జయించ వలెనను కోరికను ఫలింప చేయలేదు. అట్లే రావణుని కథకూడ. శివారాధనము చేసినను, సీతమ్మను పొందవలెనను కోరిక ఫలింప లేదు. రాముని జయించు ప్రగాఢమగు కోరికకూడ ఫలించ లేదు. అధర్మమగు కామము ఆరాధనలచే ఫలింపచేసుకొను ప్రయత్నము అజ్ఞానమని, ఏ దేవతలును అట్టి కామము పూర్ణము కావింపలేరని తెలియవలెను.

కలియుగమున కామపూర్ణమే ప్రధానముగ ఆరాధనలు సాగు చున్నవి. ధర్మబద్ధత లేని ఆరాధనము వృద్ధి చెందుచున్నది. ప్రార్థనా మందిరములు, ఆలయములు నిండిపోవుచు నున్నవి. నూతన మందిరములు, ఆలయములు మిక్కుటముగ ఏర్పడు చున్నవి. కారణము మితిమీరి పెరుగుచున్న కోరికలే. కోరికలు తీరుట తీరకపోవుట మాత్రము అందీ అందని ఫలములవలె మురిపించు చునే యున్నవి. ధర్మము ననుసరించని ఆరాధనలు జీవులను ఉద్ధరింపలేకున్నవి. కనుకనే ప్రజలు మూఢత్వమున పడు చున్నారు. జ్ఞానము లేని భక్తి, ఆరాధన సంఘమున చప్పుళ్ళు పెంచు చున్నవే కాని ప్రశాంతత నిచ్చుటలేదు. హృతజ్ఞానుల ఆరాధన ఒక డంబాచారమై భూగోళమున అయోమయమును పెంచు చున్నది. జాతి అభివృద్ధి మాత్రము జరుగుట లేదు.

(21)

# సమభావము

**యోయో యాంయాం తనుం భక్తః శ్రద్ధయాఽర్చితు మిచ్ఛతి।**
**తస్య తస్యాచలాం శ్రద్ధాం తామేవ నిదధ్యా మ్యహమ్ ॥**

తాత్పర్యము : ఏ మానవుడు ఏఏ దేవతలయందు శ్రద్ధ కలిగి అర్చించుచున్నాడో, వాని కాయా దేవతల రూపమున నేనే ఫలముల నిచ్చుచున్నాను.

వివరణము : కోరికలు ప్రేరణగ, అజ్ఞానులగు మానవులు అనేకానేకమగు దేవతలను పై శ్లోకమున తెలిపిన విధముగ ఆరాధించుచు నుందురు. కోరికల తీవ్రతనుబట్టి శ్రద్ధను పెంచు కొనుచుండును. భక్తిని పెంచుకొనుచుండును. ఆరాధన యందలి భక్తి శ్రద్ధల కారణముగ కొన్ని కొన్ని కోర్కెలు తీరుచు నుండును. కొన్ని తీరవు. తీరుట తీరకపోవుట పూర్వకర్మము ననుసరించి యుండును. అందరికిని కర్మఫలములను ఆయా దేవతల రూప మున అందించువాడను నేనే. కొన్ని కోరికలు తీరుట వలన మానవులు ఆరాధనము వదలక భక్తి శ్రద్ధలతో చేయుచునుందురు.

క్రమముగ వారికి భక్తి, శ్రద్ధ, ఆరాధన అనునవి అభ్యాసమై ఉన్నతి చెందుటకు కావలసిన బీజములు స్థిరపడును. ఇట్లు కొన్ని జన్మలు గడువగ, కోరికలతో సంబంధము లేని ఆరాధన, భక్తి, శ్రద్ధ అభ్యాస వశమున నిర్వర్తింపబడు చుండును. వాని కారణముగ కర్మ, ధర్మ స్వరూపములు తెలియుట జరుగును. అపుడు కోరికల కన్న కర్తవ్య ములకు, ధర్మాచరణమునకు ప్రాధాన్యత నిచ్చుట ప్రారంభ మగును. అట్టి దశలో సత్సాంగత్యము, సత్పురుష సమాశ్రయము ఇత్యాదివి లభించి సత్యమగు మార్గమునకు దారి చూపును.

దైవము తల్లియై, తండ్రియై జీవుల కోర్కెలను కొన్నిటిని తీర్చుచు, కొన్నిటి నుండి పాఠములు నేర్పుచు చిన్న పిల్లలను ఏ విధముగ ప్రేమతో శిక్షణనిచ్చి పెద్దలు కర్తవ్యముల వైపునకు నడిపింతురో, అట్లే ఓర్పుతో, నేర్పుతో, ప్రేమతో తన అంశలైన జీవులను తనవద్దకు చేర్చుకొనును.

అజ్ఞానమువలన జీవుడు కర్తవ్యములకన్న కోర్కెలయందాసక్తి మెండుగ కలిగి యుండును. అట్టివానికి కోరిక లుండరాదని బోధించినను, శాసించినను ఉపయోగము లేదు. అతడున్న స్థితి నుండియే అతనికి క్రమముగ శిక్షణనిచ్చుట, నేర్పుట, ఉద్ధరించుట దైవము అతి నైపుణ్యముతో నిర్వర్తించును. అమితమగు ఓర్పు, సహనము, ప్రేమ, నైపుణ్యము, దైవము ప్రదర్శించుచు గోవుల నదలించు గోపాలకులవలె జీవులను అనేకానేక జన్మలలో తన మార్గములోనికి చొప్పించి, అనేకానేక జన్మలలో మార్గమున

అనుభూతి నిచ్చి, అనుభవము నిచ్చుచు తనదరి చేర్చుకొనును. కనుక కోరికలుండరాదను శాసనము చేయుట. కోరికలు సత్య పరమై, ధర్మపరమై, కర్తవ్యపరమై యుండునట్లు కాలక్రమమున జీవులను మలచుకొనును. జ్ఞానుల యందు, అజ్ఞానుల యందు సమభావము కలవాడే దైవము. అజ్ఞానుల యందుకూడ ప్రీతి వహించి సంస్కరించుకొనుచు తన వద్దకు చేర్చుకొను దైవమే తల్లిగను, తండ్రిగను, హితునిగను, గురువుగను సృష్టియందు నర్తించు చున్నాడు.

## (22)

# సృష్టి ధర్మము

**స తయా శ్రద్ధయా యుక్త స్తస్యారాధన మీహతే ।**
**లభతే చ తతః కామాన్ మయైవ విహితాన్ హి తాన్ ॥**

*తాత్పర్యము :* భక్తుడు తగిన శ్రద్ధతో ఏయే దేవతల నారాధించినను, ఆయా దేవతల ద్వారా వానికి నేనే తగిన విధముగ హితమును చేకూర్చు చున్నాను.

*వివరణము :* భగవంతుడు అన్ని రూపములయందు తానే వ్యాప్తిచెంది యున్నాడు. అన్ని దేవతారూపములు కూడ తానే. ఏ దేవత నారాధించినను ఆ ఆరాధన లన్నియు దైవమునే చేరును. కనుక హితము చేకూర్చుట కూడ ఆయా రూపములనుండే జరుగుచుండును. అనుగ్రహము కలిగినపుడెల్ల అది ఒకచోట నుండియే కలుగుచుండును. కాని భక్తులు తాము ఆరాధించిన దేవతా రూపము తమ ననుగ్రహించినట్లుగ భావింతురు. సత్యమునకు అనుగ్రహించునది ఆయా రూపమున నున్న ఒకే ఒక దైవము. ఆ దైవము నామ రూపముల కతీతుడు. అనుగ్రహించుట, ఆగ్రహించుట అచ్చట నుండియే జరుగును.

భక్తులు మాత్రము తమను ఆంజనేయు డనుగ్రహించినాడు కనుక ఉద్యోగము వచ్చినదని, సుబ్రహ్మణ్యస్వామి అనుగ్రహించి నాడు కనుక వివాహము, సంతానము కలిగినదని, విష్ణువు అనుగ్రహించినాడు కనుక బంధములు తొలగినవని; రుద్రు డనుగ్రహించినాడు కనుక ఆరోగ్యము చేకూరినదని; గణపతి అనుగ్రహించినాడు కనుక విఘ్నములు తొలగినవని ఇట్లనేక విధములుగ భావింతురు.

ఉన్నదొక్కటే దైవము. ఒక్కటే అనుగ్రహము. అది కలుగుట, కలుగకుండుట ధర్మ, కర్మముల బట్టి యుండును. కేవలము పూజలు ప్రార్థనలు చేసినంత మాత్రమున కోరిన ఫలములు లభింపవు. వానివలన లభించునవి సద్బుద్ధి, సదాచారము. సద్బుద్ధి లేనిచోట ధర్మ, కర్మములు సవ్యముగ నిర్వర్తింపబడవు. కనుక ఫలితములు దక్కవు.

కనుకనే ఈ శ్లోకమున విహితమగు హితమునే కలిగింతునని భగవంతుడు పలికినాడు. విహిత మనగ నిర్ణయింపబడినదని అర్థము. చేసిన పనుల తీరును బట్టి ఫలితములు నిర్ణయింప బడుట సృష్టి ధర్మము. పూర్వ కర్మను బట్టి ఫలితము లందుట, అందకుండుట యుండును. ప్రస్తుతము చేసిన ప్రయత్నమును బట్టి మాత్రమే ఫలితములు నిర్ణయింపబడవు. కనుకనే పురుష ప్రయత్నము తగినంతగ యున్నను ఫలము లభింపక పోవచ్చును.

పై కారణముగ నిర్ణయింపబడిన ఫలములనే జీవులు పొందుచున్నారు అని దైవము పలికినాడు కాని, కోరిన ఫలములను పొందునని పలుకలేదు.

సృష్టియందు కర్మము తప్పనిసరి, అది ధర్మము ననుసరించి యుండవలెను. దానికి సద్బుద్ధి ప్రధానము. అట్టి బుద్ధిని పొందుటకే పూజలు, ప్రార్థనలు, ఆరాధనలు. ఫలితముల కొరకారాధించుట సదాచారము కాదు. అట్లారాధించినను వారి వారి కర్మ పరిపాకమును బట్టి ఫలితములు లభించుట, లభించకపోవుట యుండును. ఆరాధనము వలన బుద్ధిబలము దైవబలము కలిగి కార్యములను సకాలమున నిర్వర్తించు స్వభావ మేర్పడును. ఇదియే సృష్టి ధర్మము. దానినే దైవమిచ్చట ఆవిష్కరించు చున్నాడు.

(23)

# అనంత తత్త్వము

**అంతవత్తు ఫలం తేషాం తద్భవ త్యల్ప మేధసామ్ ।**
**దేవాన్ దేవయజో యాంతి మద్భక్తా యాంతి మా మపి ॥**

*తాత్పర్యము :* అల్పమేధస్కులు అల్పమగు ఫలములకై అనేక దేవతామూర్తుల నారాధింతురు. నన్నారాధించు భక్తులు నన్నే చేరెదరు. దేవతల నారాధించు భక్తులు ఆయా దేవతలను చేరుదురు.

*వివరణము :* దేవతామూర్తు లన్నియు రూపము చేత, నామము చేత, స్వభావము చేత పరిమితులై యుందురు. దైవముపై ఆధారపడి యున్నవే ఆ దేవతా రూపములన్నియు. దైవ మపరిమితుడు. దేవతలు పరిమితత్త్వము కలవారు. వారి ధర్మములు వారికుండును. వారి కర్తవ్యములు వారికున్నవి. వారతీతులు కారు. అతీతమైన తత్త్వము సర్వవ్యాపకమై, సర్వశక్తి మంతమై, సర్వజ్ఞమై (అనగా సర్వము తెలిసినదే) యుండును. ఇట్లపరిమిత తత్త్వమును ఆరాధించువారు అపరిమితము లోనికి

చేరుచున్నారు. పరిమితమగు ప్రజ్ఞల నారాధించువారు పరిమిత మగు లోకములలోనే యుందురు.

త్రిమూర్తులు, త్రిశక్తులు సహితము వారి వారి ధర్మములను నిర్వర్తించుచు నుందురు. వారికి మూలమైన తత్త్వము అతీతమగు తత్త్వము. ఆ తత్త్వమునే "నేను" అని పదే పదే భగవానుడు పలుకుచున్నాడు. నేననగా మురళీధరుడగు, మోహనమూర్తి యగు కృష్ణుడని కూడ భావింపరాదు. ఆ కృష్ణుని నుండి పలికిన తత్త్వము నేను. అట్టి నేను అందరియందు యున్నది. లోపల వెలుపల నున్నది. అంతట వ్యాప్తిచెంది యున్నది. అది అవ్యక్తము, అపరి మితము. అట్టి తత్త్వము నారాధించువారు అదియే అగుచున్నారు. జ్ఞానులట్టివారు. వారు తత్త్వదర్శనులు. వారపరిమితమున శాశ్వతులై నిలతురు. అందుండేర్పడిన నామ రూపాత్మకమగు దేవతలు పరిమితులు. వారి నారాధించువారు పరిమితముగనే యుందురు. ఇదియొక సత్యము.

ఈ శ్లోకమున మరియొక సత్యము తెలుపబడినది. ఆరాధకులు అల్పమగు, అంతమగు ఫలములను కోరుచుందురు. శాశ్వత ఫలములను కోరకుండుట వారి అజ్ఞానమునకు తార్కా ణము. అల్ప మేధస్సు కారణముగ అనంతమగు తత్త్వమును విడిచి అంతవంతమగు, అల్పమగు ఫలమును కోరుట జరుగు చుండును.

దాత అపరిమితుడైనపుడు అట్టి వానిని అల్పమగు మరియు నశించు అంశములను కోరుట తెలివితక్కువతనమే కదా! దాత కోటీశ్వరుడైనపుడు పదిపైసలు దానమడుగుట ఎట్టిదో, అట్లే అపరిమితమగు దైవ తత్త్వమును ఆరాధించుచు, అల్పమగు ఫలములను కోరుట. మూడు లోకములను ఈయగల దాతను ఆరాధించుచు నశించు ఫలములను కోరుట అజ్ఞానమని, అజ్ఞానులే అట్లు కోరుదురని, అట్టి వారిని బుద్ధి తక్కువ వారని పేర్కొనబడుచున్నది.

## (24)

# "ఓం సత్యం పరం ధీమహి"

**అవ్యక్తం వ్యక్తి మాపన్నం మన్యంతే మా మబుద్ధయః ।**
**పరం భావ మజానంతో మమావ్యయ మనుత్తమమ్ ॥**

*తాత్పర్యము :* బుద్ధిహీనులు అవ్యక్తుడను, పరుడను, ఉత్త మోత్తముడను అగు నన్ను తెలియలేక, ఒక వ్యక్తిగను పరిమితుడు గను భావించు చున్నారు.

*వివరణము :* దైవమనగ కొందరికి పురుషమూర్తి. కొందరికి స్త్రీమూర్తి. కొంతమందికి వెలుగు. కొంతమందికి రుద్రుడు. కొంతమందికి విష్ణువు. ఇట్లనేకానేకములై నటువంటి నామ రూపములలో నుండి వ్యక్తమగు తత్త్వమును బుద్ధిహీనులు గ్రహించలేరు. వారు తత్త్వమును తెలియలేరు. కనుక నామ రూపములకు పరిమితమగుచు, అందలి దైవమును తెలియ లేకున్నారు. నామ రూపములే దైవ మనుకొనుచున్నారు. నామ రూపములకు ఆపద యున్నది. అనగా ఉండుట లేకుండుట యున్నది. కాని అందలి తత్త్వమునకు అట్టి పరిమితులు లేవు. అది శాశ్వతమై యుండును.

ఉదాహరణకు కృష్ణుని భౌతిక రూపము నేడు గోచరింపదు. కాని తత్త్వతః కృష్ణుడున్నాడు. తత్త్వపరమగు కృష్ణుడు శాశ్వతుడు. నామ రూపాత్మకమగు కృష్ణుడు ఆ తత్త్వమునకు వాహిక. కనపడునది వాహిక. అందుండి పనిచేయునది తత్త్వము. తత్త్వము కనపడదు. అది అవ్యక్తము. కాని రూపమునుండి, నామము నుండి వ్యక్తమగు చుండును. ఉదాహరణకు ఒక పంకా (ఫ్యాన్)ను గమనించుడు. దానినుండి వ్యక్తమై గాలి నిచ్చునది అందలి విద్యుత్తే. విద్యుత్తు కనపడదు. కాని పరికరము నుండి వ్యక్తమగు చుండును. విద్యుత్తు చోటంతయు నిండి యుండును. శాశ్వతముగ నుండును. కాని పంకా శాశ్వతముగ నుండదు. కాలక్రమమున నశించును. ఇట్లు వ్యక్తముగ గోచరించు రూపములనుండి వ్యక్తమగునది అవ్యక్తమగు తత్త్వము. రూపాదుల కాపదున్నది. తత్త్వమునకు ఆపద లేదు. దానికి మరణము లేదు. దాని నగ్ని దహింపలేదు. వాయువు కదల్ప లేదు. నీరు తడుపలేదు. మట్టి మసిచేయలేదు. కాని వ్యక్తమైన రూపమునకు అట్టి ఆపద యున్నది.

గురువుగారి రూపము నశించినను అందుండి వ్యక్తమగు గురుతత్త్వము నశించదు. అది అవ్యక్తము. అవ్యక్తమగు తత్త్వము మూడు గుణముల నుండి, పంచభూతముల నుండి వ్యక్తమగు చుండును. గుణ భూతాత్మకమగు రూపము మార్పునకు గురి యగును. దాని కతీతమైన తత్త్వము మార్పులేక యుండును. కనుక ఒకే గురుతత్త్వము పరంపరాగతముగ రూపములనెన్నుకొని పనిచేయుచు నుండును. గురు రూపముతోకన్న, గురు తత్త్వముతో

అనుబంధ మేర్పరచుకొన్నవారు శాశ్వతత్వములోనికి ప్రవేశింతురు. రూపమేగాని తత్త్వమును తెలియనివారు బుద్ధిహీనులని, తెలివి తక్కువ వారని శ్రీకృష్ణుడు తెలుపుచున్నాడు.

నేనను తత్త్వము పంచభూతములకు, త్రిగుణములకు, మూల ప్రకృతికి అతీతముగ నున్నది. అది మూల ప్రకృతితో కూడి అష్ట ప్రకృతుల ద్వారా విద్యుత్తువలె వర్తించు చుండును, నర్తించు చుండును, మాయ మగుచుండును. అది ప్రకృతిరూపముల ప్రవేశించునపుడు ప్రకృతులయందు కదలిక యుండును. నిష్క్ర మించినపుడు ప్రకృతి జడమై నశించును. కనపడు వస్తువు లన్నియు నశించెడివే. వాని నడిపించు తత్త్వము కనపడకున్నను శాశ్వతమై యున్నది. దానికి వ్యయము లేదు. అది అవ్యయము. అది తొమ్మిది ప్రకృతులకు కూడ మూలమైనది కనుక ఉత్తమము. అది పరమై యున్నది. అట్టి పరమమును ధ్యానించుట ఉత్తమము. అట్టి పరమునే సత్యమందురు. "*ఓం సత్యం పరం ధీమహి*" అను నది అష్టాక్షరీయగు ఏకపాద గాయత్రీ మంత్రము. దానిని రూపములయందు, చోటునందు ధ్యానించువారు తెలిసినవారు. అట్టివారు నిజమగు జ్ఞానులు. కేవలము రూపమునకు ముడి పడినవారు బుద్ధిహీనులని, తెలియనివారని శ్రీకృష్ణుడు హెచ్చ రించు చున్నాడు.

## 25

# సత్య దర్శనము

**నాహం ప్రకాశః సర్వస్య యోగమాయా సమావృతః ।**
**మూఢోఽయం నాభిజానాతి లోకో మా మజ మవ్యయమ్ ॥**

*తాత్పర్యము :* యోగమాయ చేత ఆవృతమై యున్న నన్ను మూఢులు తెలియలేకున్నారు. నేను అజుడను, అవ్యయుడను.

*వివరణము :* ప్రకాశించునదెల్ల మాయయే. ఆ ప్రకాశము నకు మూలముగ, ఆధారముగ సత్యమున్నది. ప్రకాశమే కనిపించును కాని, దాని కాధారమగు తత్త్వము కనిపించదు. విద్యుత్తు కనపడదు. విద్యుత్తు ప్రకాశమే కనపడును. కనపడుతున్న దాని ఆధారమును గుర్తించుట కష్టము. కనపడినదే గుర్తించుట సులభము. కనపడునది చూచుటకు పెద్ద తెలివి అవసరము లేదు. కాని దాని ఆధారమగు తత్త్వము గుర్తించుటకు లోదృష్టి కావలెను.

రకరకముల రంగులతోను, చిత్రములతోను, రూపముల తోను ఏర్పడిన చేతి రుమాలును చూచినపుడు దాని కాధారమైన

నూలు (పత్తి) గుర్తించుట సామాన్యులకు జరుగదు. టెలివిజన్‌లో రసవత్తరమగు ఘట్టములు చూచుచున్నపుడు తన్మయత్వము చెందుటయే యుండునుగాని దాని కాధారమగు విద్యుత్తు గుర్తింప బడదు. తెరపై సినిమా చూచుచున్నపుడు తెరను గుర్తించు వారెందరు?

నేననునది సత్యము. అది ఆధారముగ మూల ప్రకృతి జనించును. అదియే మాయ. అది ప్రకాశముగ నుండును. అందుండి మూడు గుణములు పుట్టుచున్నవి. గుణములనుండి పంచభూతములు, దశేంద్రియములు, తన్మాత్రము పుట్టుచున్నవి. ఇట్లు మూల ప్రకృతిపై ఎనిమిది దొంతరలుగ దానినుండి పుట్టిన దొంతరలున్నవి. ఇన్నిటికిని మూలమగు సత్యము నేను. అది మూలప్రకృతి కతీతమై యుండును. దానివలననే ప్రకృతి ప్రకాశించు చున్నది. ఆ ప్రకాశమాధారముగ త్రిగుణాత్మకముగ, నామరూపాత్మకముగ జగత్తు, జీవులు ఏర్పడుచున్నారు. అన్నిటికిని మూలము నేను. దానికి చావు పుట్టుకలు లేవు. కనుక నేను అజుడను అని పరమాత్మ పలుకుచున్నాడు. ఈ నేనను తత్త్వము శాశ్వతమై సర్వవ్యాప్తమై యుండును. అది కాలక్రమమున పుట్టుట పెరుగుట నశించుట, అదృశ్యమగుట అను మార్పులను చెందక అవ్యయమై యుండును. శాశ్వతముగ నుండును. కనుక "నేను అవ్యయుడను" అని పరమాత్మ పలుకుచున్నాడు.

అట్టి పరమాత్మను తన యోగమాయ లేక మూల ప్రకృతి తన ప్రకాశముచే కప్పియుంచును. కనుక మూఢులు తనను చూడలేరు అని కూడ పరమాత్మ పలుకుచున్నాడు.

కనబడుదాని కాధారమైన దానిని, అట్లే వినబడు దాని కాధారమైన దానిని, తన తెలివికి ఆధారమైన దానిని తెలియుట యనగా, తనను తాను తెలియుటయే! తనను తాను తెలిసినవాడే సమస్తమునకు మూలమైన వాడిని తెలియుట జరుగును. అతడే తనయందు తనవలె నున్నాడని తెలియును. అన్నిటి యందు "నేను"గనే వసించుచు నున్నాడు. వసించుట "నేను" వంతు. అది ఆధారముగ వర్తించుట, నర్తించుట మూలప్రకృతి వంతు. ఆ మూల ప్రకృతినే పెద్దలు మాయ యని పిలిచిరి. సత్యమును మరుగు పరుచునది గనుక మాయ యనిరి. మాయ అనుగ్రహించి నచో సత్యమును దర్శింపవచ్చును. సత్యమును దర్శించువానిని మాయ గౌరవించును. అట్టివారు జ్ఞానులు. వారే యోగులు, ఋషులు, నిజమగు భక్తులు కూడ. వారు సత్యమునే దర్శింతురు గాని ప్రకృతి విలువలను, తళుకు బెళుకులను చూచి వికృతి చెందరు. ఇట్లు సత్యదర్శనము చేయని వారందరును మూల ప్రకృతి, దాని సంతానమైన అష్ట ప్రకృతుల మార్పులలో చిక్కు కొందురు. అట్టివారు మూఢులని పరమాత్మ తెలుపుతున్నాడు.

26

# అవ్యక్తుడు

వేదాహం సమతీతాని వర్తమానాని చార్జున ।
భవిష్యాణి చ భూతాని మాం తు వేద న కశ్చన ॥

తాత్పర్యము : ఓ అర్జునా! నేను జరిగిపోయిన కాలము, జరుగుచున్న కాలము, జరుగబోవు కాలము, అందు వర్తించు జీవులను ఎరిగినవాడను. కాని నావలె ఎరిగినవాడు మరొకడు లేడు.

వివరణము : అంతర్యామిత్వము నందు శ్రద్ధాభక్తులతో మనసు లగ్నము చేసి అంతర్యామిత్వమును పొందవచ్చును. అది జీవులకు పరమావధి. నామరూపముల కతీతమై, గుణముల కతీతమై, చైతన్యమునకు మూలమై యున్న నేను అను తత్త్వమును ధారణ, ధ్యాన, సమాధి మార్గమున చేరిన యోగులున్నారు. మహర్షు లున్నారు. జ్ఞాను లున్నారు. భక్తు లున్నారు. వారందరును సృష్టి లోపల వెలుపల వ్యాప్తిచెంది యున్నారు. సర్వవ్యాపకము, సర్వశక్తిమంతము, సర్వజ్ఞము అయిన తత్త్వమును అనుభూతి చెందుచునే యుందురు.

కాని వారెవ్వరును ఆ తత్త్వముతో సమానము కాదు. తత్త్వ మయుడగు దైవము మూడు కాలముల యందు వ్యాప్తి చెందు

టచే అతడివలె వ్యాపకత్వము, శక్తి, జ్ఞానము అతనిని చేరిన వారికి కూడ కలుగవు. అతడి కతడే సాటి.

అంతర్యామి దైవమును అనుభూతి చెందవచ్చును. అతనిలో మునిగి యుండవచ్చును. కాని అతడివలె అతనితో సరిసమాన ముగ ఉండుటకు వీలుపడదు. అతడొక్కడే. అందుండి వ్యక్తమైన జీవులు అందులో మరల సాధన సిద్ధించి ఇమడవచ్చునేగాని అతనితో సమానముగ నుండు వీలు లేదు.

సముద్రము నుండి విడిపడిన అల మరల సముద్రమును చేరును. చేరినపుడు ఇక అల అస్తిత్వముండదు. సముద్ర మొక్కటియే యుండును. అల పుట్టుటకు పూర్వము, అల పుట్టిన తరువాత అలయందు, అల తిరోధానము చెందుటయందు, మరల సముద్రమున కలియుటయందు, సముద్రము సాక్షిగనే యున్నది. అల పుట్టుటకు పూర్వమునుండి అల లయమగు వరకు గల మూడు కాలములు సముద్రమునకు తెలియును. అట్లే అంతర్యామి తత్త్వమునకు పూర్వోత్తరములు, వర్తమానము తెలిసి యుండును. జీవుల భూతము, వర్తమానము, భవిష్యత్ దైవము నందే నిర్వర్తింప బడును గనుక, అట్టి సర్వవ్యాపకమగు దైవమునకు అన్ని కథలు, అందరి కథలు తెలిసియుండును. అట్లు ఇంకొక రుండుటకు సాధ్యపడదు. అవ్యక్తమగు పరబ్రహ్మము కృష్ణుడుగ వ్యక్తమై బోధించి నదే భగవద్గీత. ఈ కృష్ణుడు అనగా వ్యక్తమైనవాడు అవ్యక్తుడే అని ఈ శ్లోకము వలన మరియొక మారు తెలియును.

పూర్వము కూడ అర్జునునితో "నీకును నాకును చాల జన్మలు గడిచినవి. అవి నీవు ఎరిగినవాడవు కావు. నేను ఎరిగినవాడను. నీ జన్మలు నా జన్మలు కూడ ఎరిగినవాడను" అని పలికినాడు.

## 27

# దీన స్థితి

**ఇచ్ఛాద్వేష సముత్థేన ద్వంద్వ మోహేన భారత ।**
**సర్వభూతాని సమ్మోహం సర్గే యాంతి పరంతప ॥**

*తాత్పర్యము :* ఓ అర్జునా! రాగద్వేషము లను ద్వంద్వముల వలన, సర్వభూతములును మోహము చెంది సృష్టి సర్గము చెందుచు నున్నవి.

*వివరణము :* ద్వంద్వములే సృష్టికి మూల స్తంభములు. ద్వంద్వము లున్నంత కాలము జీవులు సృష్టి మడతలలో పడి యుందురు. సర్గమనగా లోకములు. సృష్టిని మూడు లోకములు గను, ఏడు లోకములుగను, తొమ్మిది లోకములుగను వాఙ్మయము తరచు తెలుపుచు నుండును. ఇది స్థూలమగు విభాగము. సూక్ష్మముగ చూచినచో లెక్కకు అందని పొరలలో సృష్టి యున్నది. ఇవి యన్నియు ప్రాణులచే నిండి యున్నవి. ఆయా పొరలలో ఆయా ప్రాణులు మోహముచేతనే యున్నవి. ఇందెవరి లోకములు వారివి. ఎవరి మోహములు వారివి. ఎవరి రాగద్వేషములు వారివి.

శిరోజములయందు తిరుగాడు పేను లోకము వేరు. ఆ శిరోజ ములు గల మనిషి లోకము వేరు. అట్లే ఆ మనిషి పరుండు మంచమునందలి నల్లి లోకము వేరు. అక్కడే తిరుగాడుచున్న ఈగ, దోమ, చీమల లోకములు వేరు వేరుగ నుండును.

ఒకే గృహమందలి వృద్ధుల లోకము వేరు. చిన్న పిల్లల లోకము వేరు. నడివయస్కుల లోకము వేరు. ఆ గృహమందే పనిచేయుచున్న పనివారి లోకములు వేరు. ఒకే గృహమున అనేక లోకము లున్నవి. ఎవరి లోకములలో వారు తీరుబడి లేక వర్తించుచు నుందురు. ఎవరి మోహమును బట్టి వారి వర్తన ముండును. ఇక సృష్టియందుగల పొరలను వివరించుట అసాధ్యము. ఒక పెద్ద రావిచెట్టునకు అనేకానేకమగు శాఖలు ఏర్పడి, శాఖలకు ఉపశాఖలు ఏర్పడి, ఉపశాఖలకు రెమ్మ లేర్పడి, రెమ్మలకు ఆకు లేర్పడగ, ఒక ఆకునందు తిరుగాడు పురుగు లోకము తానున్న ఆకు, తన పైకప్పుగ నున్న ఆకుకన్న మరి యేమియు గోచరించదు. అదియే తన సమస్త ప్రపంచము.

ముందు తెలిపిన ఉదాహరణలతో శిరోజములలో తిరుగాడు చున్న పేనుకు ఆ శిరోజముల యజమాని తెలియదు. ఆ శిరోజ ములే దాని ఆవాసము. అందే ఆరాటపడుచు తిరుగు చుండును. ఇట్లు సర్వప్రాణులును అనేకానేక లోకములలో మోహముతో తిరుగాడుచున్నవని దైవము తెలుపుచున్నాడు. అట్టి మోహమునకు

మూలము రాగము లేక కోరిక. కోరిక తీరనపుడు ద్వేషము కలుగును. తీరినచో గర్వము కలుగును. తనకు తీరక ఇతరులకు తీరినచో అసూయ కలుగును. ఇట్లు కామ క్రోధములు, మదమాత్సర్య ములు, ఈర్ష్యా అసూయలు, రాగద్వేషములు అనంతముగ కలుగుచుండగ తీరీ తీరని కోరికలతో జీవులు మోహమున అనేకానేక లోకములలో బద్ధులై వర్తించు చున్నారని దైవము లోకుల దీనస్థితిని అర్జునునకు తెలుపుచు నున్నాడు.

(28)

# శాశ్వత పరిష్కారము

**యేషాం త్వంతగతం పాపం జనానాం పుణ్యకర్మణామ్ ।**
**తే ద్వంద్వ మోహనిర్ముక్తా భజంతే మాం దృఢవ్రతాః ॥**

*తాత్పర్యము :* పుణ్య కర్మల నాచరించుచు, తద్వారా పాపముల నంతము గావించుకొనుచు, నన్ను భజించువారు మోహజనితమైన ద్వంద్వముల నుండి విముక్తులు కాగలరు.

*వివరణము :* జీవులకు కర్మ అనివార్యము. అందు మానవులకు కర్మఫలములు, పర్యవసానములు యున్నవి. దానికి కారణము మానవులకు దైవము స్వతంత్రత నిచ్చినాడు. ఇతర జీవులు ప్రకృతిచే నియమింపబడి, ప్రకృతిచే నిర్వర్తింపబడుదురు. వాని విషయమున ప్రకృతియే బాధ్యత వహించును. వారికి స్వతంత్ర బుద్ధి లేదు. స్వేచ్ఛ లేదు. కాని మానవులకు దైవము బుద్ధి నిచ్చి, స్వేచ్ఛ నిచ్చినాడు. కనుక వివేకమును, విచక్షణమును వినియోగించుచు కార్యములను నిర్వర్తించవలెను. పెరిగిన సంతానమునకు తల్లి దండ్రులు స్వేచ్ఛ నిచ్చినట్లుగ, పరిణామక్రమమున పెరిగిన మానవునకు ప్రకృతి స్వేచ్ఛ నిచ్చినది.

స్వేచ్ఛను హక్కుగా గాక బాధ్యతగా నిర్వర్తించుట ప్రధానము. అట్లు నిర్వర్తించుటకు బుద్ధి ప్రసాదింపబడినది. అకార్యములు గాక, సకార్యములు నిర్వర్తించుటకు మానవునకు విద్యలు కూడ ఏర్పడినవి. విద్యావినయములతో బుద్ధిని జోడించి కార్యములు నిర్వర్తించుకొను బాధ్యత మానవులపై యున్నది.

మానవులు చేయవలసిన పనులు చేయక, చేయదలచిన పనులు చేసినపుడు పర్యవసానము లుండును. చేయవలసిన వనగా కర్తవ్యములు. చేయదలచిన వనగా కోరికలు. మొదటి వానిని కర్తవ్య కర్మలని, కార్యం కర్మలని, నిష్కామ కర్మలని పేర్కొందురు. రెండవ వానిని కామ్యకర్మలని పేర్కొందురు. కామ్య కర్మలు బంధించును. కర్తవ్య కర్తలు విడుదల నిచ్చును. బుద్ధి మంతులు కామపూరణము కొరకైకాక, కర్తవ్యమునకై జీవింతురు. అట్టివానిని కర్మలు బంధింపవు. బంధించు కర్మలు అన్నియు బుద్ధిహీనత వలన ఏర్పడును. అవియే పాపములు.

పాపమనగా స్వార్థము కొరకై నిర్వర్తింపబడి, పర్యవసానముల నిచ్చునవి. పుణ్యములనగా పరహితార్థము నిర్వర్తింపబడినవి. పాపములనుండి బయట పడవలెనన్నచో పరహితార్థ కర్మలు నిర్వర్తించుటే మార్గమని శ్రీకృష్ణుడు బోధించుచున్నాడు. "పుణ్య కర్మలవలన జనులు పాప కర్మలను పరిహరింపకొన వచ్చును." దీనికి వలసినది బుద్ధి.

అట్టి బుద్ధి జనించవలెనన్నచో దైవారాధనము ప్రధానమగు ఉపాయము. కనుక దృఢవ్రతులై నన్ను భజించువారు ద్వంద్వ మోహములనుండి విముక్తు లగుదురని కూడ పలికినాడు. భక్తి శ్రద్ధలతో విధి విధానముగ దైవము నారాధించినపుడు జీవులు కామ్య భావముల నుండి కర్తవ్య భావముల లోనికి మళ్ళుదురు. దైవారాధనము యొక్క ముఖ్యప్రయోజన మిదియే. కోరికలు తీరుటకై ఆరాధనము చేయువారు మోహము కారణముగ ద్వంద్వ మున పడుదురు. నిర్మలముగ ఆరాధనము చేయువారు బుద్ధి ప్రచోదనము కలిగి కర్తవ్యములందు మేల్కాంతురు.

కోరికలతో ఆరాధనము చేయుటవలననే రావణ కుంభ కర్ణులు అసురులైనారు. కోరికలు లేక ఆరాధనము చేసిన ప్రహ్లాద అంబరీషులు తరించినారు. కోరికలతో ఆరాధనము చేయుట వలన కోరికపై భక్తి యుండును గాని, దైవముపై భక్తి యుండదు. కోరిక వలన మోహము, మోహము వలన ద్వంద్వములు, వాని వలన అజ్ఞానపు కర్మలు వరుసక్రమమున సాగుచుండును. ఇట్టి వారు ఎప్పటికిని తరింపలేరు. భక్తి కోరికపైగాక, దైవముపై నుంచి ఆరాధనము చేసినపుడు బుద్ధి ప్రచోదనమై, కర్తవ్యా కర్తవ్యములు తెలియును. అట్టివాడు కర్తవ్యములను, పరహిత కర్మములను నిర్వర్తించుచు ముక్తుడగును.

ఈ రహస్యము గుర్తించక స్వార్థముకొరకై ఆరాధనము చేయుచు భక్తులమని జీవించు భక్తులు కోటానుకోట్లుగ నున్నారు.

ఉదాహరణకు నిత్యము గాయత్రి మంత్రము గానము చేయు వారెందరో యున్నారు. ఆ మంత్రము ప్రయోజనము బుద్ధి ప్రచోదనమే కాని వేరొకటి కాదు. భక్తి శ్రద్ధలు కలిగి దృఢమతులై బుద్ధి ప్రచోదనమునే కోరినపుడు భర్గోదేవుడు బుద్ధి ప్రచోదనమునే అనుగ్రహించును. అట్లుగాక ఇతరములైన కోరికలు మనసున నింపుకొని, ఆరాధనము చేయువారికి ఎన్ని జన్మలకైనను కర్మ బంధము వీడదు. మోహము తొలగదు. ముక్తి లభించదు. ముక్తి కోరినవారికి కూడ ముక్తి లభింపకపోవుటకు కారణము కోరుటయే. కోరినచో లభించునది కాదు ముక్తి. కోరుట నుండి కర్తవ్యము వైపునకు, పరహిత కార్యము వైపునకు మనసును మరల్చవలెను. దానికి వలసిన బుద్ధి ప్రచోదనములకు దైవము నారాధించవలెను. ఈ శ్లోకమున శ్రీకృష్ణుడు మానవజాతికి శాశ్వత పరిష్కారమిచ్చెను. కనుక ఆర్తులు, అర్థార్థులు, జిజ్ఞాసులు క్రమముగ దైవముపై భక్తి కలిగి పరహితార్థము జీవించినపుడు జ్ఞానులుగ ప్రకాశింతురు. అట్టి జ్ఞానులే ముక్తజీవులు.

29

# సారూప్యము

**జరామరణ మోక్షాయ మా మాశ్రిత్య యతంతి యే ।**
**తే బ్రహ్మ తద్విదుః కృత్స్న మధ్యాత్మం కర్మ చాఖిలమ్ ॥**

*తాత్పర్యము :* నన్నాశ్రయించు వారు ధర్మస్వరూపమును పరిపూర్ణముగ తెలుసుకొని, ఆత్మ స్వరూపమునుకూడ పూర్తిగ గ్రహించి, పరబ్రహ్మ తత్త్వముతో ముడిపడి, జనన మరణముల నుండి ముక్తిని పొందుచున్నారు.

*వివరణము :* భగవంతుడగు శ్రీకృష్ణుడు తాను-నేను అనగా రెండు శ్లోకములలో నిర్వచించినాడు. తాను సర్వవ్యాపకమగు తత్త్వమని, భూత భవిష్యత్ వర్తమానములు తనయందే నిర్వర్తింపబడునని, సర్వభూతములను తానెరుగుదునని, తాను శాసించగలనని, అవ్యయుడ నని, మాయ తన ప్రకాశమని, నామ రూపాత్మక జగత్తునందు తాను ప్రవేశించి యున్నను దానికి పరముగ నుందునని, అన్నిటికిని తానే మూలమని, తనను నామ రూపాత్మకములకు అతీతమైనటువంటి, శాశ్వతమైనటువంటి, సర్వము తెలిసినటువంటి తత్త్వముగా తెలియవలెనని, తాను ఏ నామమునకు, ఏ రూపమునకు బద్ధుడను కానని, కాని అన్నిటి యందు

తానే వాసుదేవ స్వరూపముగా వసించి యున్నానని, తానొక్కడే తనమాయ చేత అష్ట ప్రకృతుల ద్వారా ఈ సృష్టి మొత్తముగ ఏర్పడి యున్నానని, ఇట్లపరిమితుడైన తనను సతతము దర్శించు వాడే తనను చేరగలడని తెలిపియున్నాడు.

"నన్నాశ్రయించుటకు యత్నించు వాడనగా అపరిమితమగు తత్త్వమును నామ రూపాత్మకమగు వస్తువులయందు దర్శించుట. అట్లు దర్శించినవానికి కర్మజ్ఞానము, ధర్మజ్ఞానము, ఆత్మజ్ఞానము, పరమాత్మ జ్ఞానము తప్పక లభింపగలదు. వెండితెరను దర్శించు వానికి తెరపై బొమ్మలు, సంఘటనలు అన్నియు కాలక్రమమున వచ్చిపోవునవే అని తెలియును. దానినుండి ఉద్భవించిన పాత్రలు దానిలోనికే లయమగును. అట్లు వెండితెర ధ్యాసవలె విశ్వ వ్యాప్తక మగు ఈశ్వరుని దర్శించుచు, ఏకభక్తితో నున్నవానికి జననము, మరణము కూడ వచ్చిపోవునవే అని తెలియును. దాని నుండి ఉద్భవించిన పాత్రలు దానిలోనికే లయమగును. అట్లు వెండితెర ధ్యాసవలె విశ్వవ్యాప్తమగు ఈశ్వరుని దర్శించుచూ ఏకభక్తితో నున్న వానికి జననము, మరణము కూడ వచ్చిపోవునవే అని తెలియును. తాను వస్తుతః పరమాత్మ అంశయే. పరమాత్మయే తానుగ నున్నాడని, తన చుట్టునూ అష్ట ప్రకృతుల ఆవరణము ఏర్పడి ఉన్నవనియు, వానియందు తానున్నప్పటికిని తనకు వాటితో బంధుత్వము తాత్కాలికమని, తాను పరమాత్మకు చెందిన వాడి నని, తనకు మరణము, జననము లేవని తెలిసియుండును.

దైవమును అన్నిటా, అంతటా, అన్ని కాలముల యందు, అన్ని దేశములయందు, అన్ని రూపములయందు, అన్ని నామముల

యందు అహర్నిశలు దర్శించుట, అనునిత్యము దర్శించుట, అనన్యముగ దర్శించుట, భావముతో శాశ్వతముగ ముడిపడి యుండుట జరిగిననే కాని భగవంతుడు తెలిపిన మోక్షస్థితి కలుగదు. ఏకము, నిత్యము, అమలము, సర్వవ్యాపకము అయిన ప్రజ్ఞను నిత్యము ఉపాసించుచు, దానితో యుక్తుడై యుండుట వలన మాత్రమే జీవాత్మ తన నిజస్థితిని తెలిసి, అపరిమితుడే తానుగ నున్నాడని, నిజముగ తాను లేడని, తనవలె యున్నది దైవమే యని తెలియును. అలవలె నున్నది సముద్రమే. సముద్రమే 'అల' యగుచున్నది. అల సముద్ర మగుచున్నది. అలకు ప్రత్యేకమగు అస్తిత్వము లేదు. సముద్రము లేనిదే అల లేదు. సముద్రమే అలగ యున్నట్లు, పరమాత్మయే జీవాత్మగ యున్నాడు. తనయందు ఏర్పడిన ప్రకృతి ఆవరణను తాను కాదని తెలిసినవాడే జ్ఞాని. అట్టి జ్ఞాని నాకిష్టుడని భగవానుడన్నాడు. అట్టి జ్ఞాని నేనే అనికూడ అనినాడు.

దైవీతత్త్వ జ్ఞానము, దాని ఆరాధనము తెలిసిన జిజ్ఞాసువు నామ రూపములయందు, దేశకాలములందు, అష్ట ప్రకృతుల యందు పట్టుబడని పరతత్త్వముతో కూడియుండి, దానిని చేరి అదియే తానై నిలచును. కనపడుచున్న సృష్టియందుగల దైవమును ఇట్లు దర్శించి సారూప్యమును చెందమని ఈ అధ్యాయమున శ్రీకృష్ణుడు సూటిగ బోధించినాడు.

## (30)

# యుక్త చేతస్సులు

**సాధిభూతాధిదైవం మాం సాధియజ్ఞం చ యే విదుః ।**
**ప్రయాణకాలేఽపి చ మాం తే విదు ర్యుక్త చేతసః ॥**

*తాత్పర్యము :* అధియజ్ఞము, అధిభూతము, అధిదైవము నిశ్చయముగ తెలిసిన జ్ఞానులు అంత్యకాలమున నాయందే చేతన నిలిపి నన్ను చేరుచున్నారు.

*వివరణము :* తెలిసినవారు జ్ఞానులు. వారికి సృష్టియొక్క యజ్ఞ స్వరూపము తెలియును. సృష్టియజ్ఞము పరహితార్థ మేర్పడి నదని తెలియును. యజ్ఞార్థ జీవనమనగా, సమష్ఠికి వ్యక్తి సమర్పణ చెంది, సమష్ఠి శ్రేయస్సుకై కృషి చేయుట. తన కొరకై జీవించుట కాదు. తనకొరకు జీవించువాడు సృష్టియందు బంధింపబడును. ఈ సత్యము తెలిసి, తదనుగుణముగ జీవితమును మలచు కొనువాడు జ్ఞాని. అతనికి కనపడుతున్న సృష్టి, అందలి జీవులు, వారి కాధారభూతమైన దైవీ ప్రజ్ఞలు, వాని లక్షణములు కూడ తెలియును. మూడు భాగములు అమృతముగను, దివ్యముగను;

ఒక భాగము మర్త్యముగను, భౌతికముగను సృష్టి ఏర్పడి యున్నదని తెలియును. ఈ నాలుగు పాదములను నిండి దాని నతిక్రమించి కూడ దైవీతత్త్వ మున్నదని తెలియును. కనుక జ్ఞానులు సర్వకాల సర్వావస్థల యందును సృష్టి కాధారభూతమైన తత్త్వమును సృష్టి యందును, సృష్టి కతీతముగను భావించుచు, దర్శించుచు అను క్షణము జీవితమును గడుపుదురు. వారు యుక్త చేతస్సులు అని దైవము తెలుపుచున్నాడు. అనగా తత్త్వముతో కూడిన చైతన్యము కలవారు. ఇట్లనుక్షణము తత్త్వముతో కూడిన చేతస్సు కలవాడు తత్త్వమునందే యుండుటవలన శరీరము పడిపోయినప్పుడు కూడ తత్త్వమునందే యుండును గాని మరణ భావము, తదనుగుణ మగు బాధ యుండదు. పండిన పండు ఏ విధముగ వృక్షము నుండి స్వచ్ఛందముగ రాలునో అట్లే స్వచ్ఛందముగ పాంచభౌతిక శరీరమును వీడును. మూడు గుణములను కూడ వీడును. శుద్ధ చైతన్యముగ దైవమును కూడును. వస్త్రమును విసర్జించునట్లే సునాయాసముగ శరీరమును వీడును.

ఈ అధ్యాయమునగల చివరి శ్లోకము విజ్ఞాన యోగమునకు ఫలశ్రుతి. ఇందు సృష్టి రూపమున యున్న దైవమును అహర్నిశలు దర్శించుచు, యజ్ఞార్థము జీవించు జ్ఞాని ఎట్లు తరించునో తెలుప బడినది. సృష్టి రూపములన్నియు దైవీ ప్రకృతి నుండి ఏర్పడినవే. అందలి జీవులన్నియు దైవాంశములే. ఇది ఎరిగి అనుక్షణము

దైవమును, దైవీ ప్రకృతి మార్గమును దర్శించువానికి సూటిగ దైవము లభించును. అట్లుగాక మానవులు తమకు తోచిన విధముగ దైవరూపముల నేర్పరచుకొని, వానికి నామకరణములు చేయుచు, వానిలో చిక్కుకొనుట వలన కలుగునది మూఢత్వమే, అజ్ఞానమే. ఇట్లు చిల్లర మార్గములో వర్గ బేధములు, మత బేధములు, కలహములు నిత్యము తాండవము చేయుచు నుండును. కనుక దైవీతత్త్వము యొక్క స్వరూప స్వభావము నెరిగి ఉపాసించుట ముఖ్యము.


సృష్టియందే ఉన్న దైవమును చూచుట విజ్ఞానము. అట్టి దర్శనము వలననే సృష్టి కతీతముగ నున్న దైవము కూడ తెలియ బడును. విజ్ఞానము ద్వారా జ్ఞానము పొందుట ఉపాయముగ తెలుపబడినది.


శ్రీమద్భగవద్గీత యందలి 7వ అధ్యాయము


“విజ్ఞానయోగము” వివరణము


సంపూర్ణము.

## ధనిష్ఠ ప్రచురణలు




**ప్రతులకు : ధనిష్ఠా ఫౌండేషన్, 15-7-1, ఏంజిల్స్ ఎన్‌క్లేవ్, కృష్ణనగర్, విశాఖపట్నం - 530 002.**

Phone : 0891-2701531

www.dhanishta.org info@dhanishta.org

సృష్టియందే ఉన్న దైవమును చూచుట విజ్ఞానము. అట్టి దర్శనము వలననే సృష్టి కతీతముగ నున్న దైవము కూడ తెలియబడును. విజ్ఞానము ద్వారా జ్ఞానము పొందుట ఉపాయముగ తెలుపబడినది.

సృష్టి రూపమున యున్న దైవమును అహర్నిశలు దర్శించుచు, యజ్ఞార్థము జీవించు జ్ఞాని ఎట్లు తరించునో తెలుప బడినది. సృష్టి రూపములన్నియు దైవీ ప్రకృతి నుండి ఏర్పడినవే. అందలి జీవులన్నియు దైవాంశములే. ఇది ఎరిగి అనుక్షణము దైవమును, దైవీ ప్రకృతి మార్గమును దర్శించువానికి సూటిగ దైవము లభించును. అట్లుగాక మానవులు తమకు తోచిన విధముగ దైవరూపముల నేర్పరచుకొని, వానికి నామకరణములు చేయుచు, వానిలో చిక్కుకొనుట వలన కలుగునది మూఢత్వమే, అజ్ఞానమే. ఇట్లు చిల్లర మార్గములో వర్గ బేధములు, మత బేధములు, కలహములు నిత్యము తాండవము చేయుచు నుండును. కనుక దైవీతత్త్వము యొక్క స్వరూప స్వభావము నెరిగి ఉపాసించుట ముఖ్యము.

ధనిష్ఠ

ISBN 978-81-89467-62-3

9 788189 467623 >

Sathyam - 9849996538